www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
27-03-2026
RNI No : TGTEL/25/A1676
సంపుటి : 01 | సంచిక : 254 | పేజీలు : 08 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## అన్ని రాష్ట్రాల సీఎంలతో నేడు
# ప్రధాని సమావేశం

- పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం అప్రమత్తం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న మోడీ
- రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలన్న ప్రధాని



2

## అసెంబ్లీ నడుస్తుంటే
# ఆటలేంటి?

- ప్రభుత్వం ప్రజా సమస్యలపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుంది
- పద్దులపై చర్చను ముగించి పారిపోవాలని చూస్తున్నది
- ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించకుండా కాలయాపన చేయడం సరికాదు
- అసెంబ్లీ లాబీల్లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కేటీఆర్



2



# విద్య, పేదల వైద్యం
## మాకు అత్యంత ప్రాధాన్యాంశాలు

**వైద్యానికి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం**

**గత ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిలను పెండింగ్‌లో ఉంచింది**

- 27 నెలలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చేశాం
- ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకొచ్చాం
- 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నాం
- టీచింగ్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ రోగులు..
- శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో**

ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి, అవసరమైతే మరిన్ని నిధులను సమకూర్చుతామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా ఇప్పటివరకు అత్యధికంగా నిధులు వెచ్చించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం గడిచిన 27 నెలల కాలంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్, ఎల్‌ఓసీ రూపంలో అందించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన గణాంకాలను శాసన సభలో ప్రశ్నోత్తరాల సమయంలో వివరించారు. 'రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక..., మిగతా2లో...

## విపక్షాల
# విష ప్రచారం సరికాదు

- రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తుంటే ఓర్వలేకపోతున్నారు
- స్వార్థ రాజకీయాల కోసం మాపై కోపంతో చేసే ఈ తప్పుడు ప్రచారం
- 'టీ - ఫైబర్'ను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఓ రోల్ మోడల్ గా నిలిపాం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

2



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల
# చర్చ చూస్తుంటే నవ్వొస్తుంది

- కేసీఆర్ ప్రభుత్వ పాలన గురించి గొప్పలు చెప్పకోవడమే లక్ష్యంగా మాట్లాడటం సరికాదు
- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలోఎలాంటి జాప్యం జరగడం లేదు
- తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా మిషన్ భగీరథ సక్రమంగా పనిచేయడం లేదు
- ఎక్కడ చూసినా పైపుల లీకేజీలు, పగిలిన పైపులతో నీరు వృథా అవుతోంది
- డిప్యూటీ సీఎం భట్టి



2






# విద్య, పేదల వైద్యం మాకు అత్యంత ప్రాధాన్యాంశాలు

(మొదటి పేజీ తరువాయి)

విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే లెక్కల ప్రకారం తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయబోతున్నాం. పేదలకు జీవిత బీమాను అందించి పేదల్లో ధీమా కల్పించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతున్నాం' అని తెలిపారు. ఆరోగ్య శ్రీ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, సరైంది కాదని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్య, వైద్య రంగాల బడ్జెట్ లో కోత పెట్టబోమని ఆయన తేల్చి చెప్పారు.

**పేదల వైద్యం కోసం రూ.4,500కోట్లు..**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 27 నెలలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద రూ.2046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.2,400 కోట్లు మొత్తంగా రూ.4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 6వ డిసెంబర్ 2023 వరకు గత ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ప్రతి నెలా సగటున రూ.52 కోట్లు ఖర్చు పెట్టిందని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం సగటున ప్రతి నెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతోందని తెలిపారు. గత ప్రభుత్వం బకాయిల భారాన్ని మాపై పెట్టిందని, గత ప్రభుత్వం నుంచి రాజీవ్ ఆరోగ్యశ్రీలో వారసత్వంగా వచ్చిన భారం రూ.600.27 కోట్లు ఉందని, అందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.240.11 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ.360.16 కోట్ల బకాయిలు ఉందని గుర్తు చేశారు. ఆ భారాన్ని మోస్తూనే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఈ రోజు వరకు రూ.2,408.51 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను చెల్లించామని, ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.927.99 కోట్లు, ప్రైవేట్ ఆసుపత్రులకు రూ. 1,480.52 కోట్లు చెల్లించామని, నెలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.34 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ.54 కోట్లు అందించామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద మొత్తం రూ. 725.75 కోట్ల బకాయిలు ఉంటే, అందులో గత ప్రభుత్వం బకాయిలు పెట్టిన మొత్తం రూ.600 కోట్లు, గడిచిన 27 నెలల కాలంలో ఈ ప్రభుత్వ బకాయిలు కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఉందని, ఇందులోనూ ప్రభుత్వ ఆసుపత్రులకే ఎక్కువగా రూ.496.31 కోట్లు బకాయిలు ఉంటే, ప్రైవేటు ఆసుపత్రులకు రూ.231.44 కోట్లు ఉందని వివరించారు.

**టీచింగ్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ రోగులు..**

రోగులు ఎక్కువగా వెళ్తున్న ఆస్పత్రుల్లో స్పెషలిస్టు డాక్టర్లు లేరని, స్పెషలిస్టుల ఉన్న టీచింగ్ ఆస్పత్రులకు రోగులు వెళ్లడం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదలు వైద్యం కోసం టీచింగ్ హాస్పిటల్స్‌కు పంపిస్తే తద్వారా అక్కడున్న నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడానికి అవకాశాలతోపాటు వైద్య విద్యార్థులకు వృత్తిరీత్యా ఎంతో అనుభవం వస్తుందని, చికిత్స అందించే అనుభవం కలిగిన వైద్యులకు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స అందడం లేదన్న వాదన వాస్తవం కాదన్నారు. సీఎంఆర్ఎఫ్ గతంలో ఎలా దుర్వినియోగ మైందో అందరికీ తెలిసిందేనని, అందుకని మరింత పారదర్శకంగా ప్రజాప్రతినిధులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి వీలు కల్పించామని చెప్పారు. విదేశాల్లో గొప్ప పేరు గడించిన వైద్యులు రాష్ట్రానికి వచ్చినప్పుడు వెసులుబాటును బట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పేదలకు వారి సేవలను అందించడానికి వీలుగా మెడికల్ అండ్ హెల్త్ వెబ్‌సైట్ ద్వారా ఒక వేదికను రూపొందిస్తున్నామని వివరించారు. సమాజంలో వైద్య రంగం ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని, ప్రజలకు ఉపయోగపడే సూచనలను స్వీకరిస్తామని, ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత విద్య, వైద్యమేనని స్పష్టం చేశారు.

**రోల్ మోడల్‌గా..**

విద్య పరంగా నర్సరీ నుంచి పై స్థాయి వరకు, వైద్యం పరంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్పెషాలిటీ హాస్పిటల్స్ వరకు ఒక ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని, మంచి రోల్ మాడల్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. నిమ్స్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు 3 వేల కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆసుపత్రితో కలిపి రాష్ట్రంలో కొత్తగా 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునికంగా వైద్యం అందించేలా తీర్చిదిద్దుతున్నామని, వీటికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పేదలకు మరింత వేగవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆస్పత్రుల నిర్వహణ విధానంలో కూడా మార్పులు చేస్తున్నామని అన్నారు. వైద్యులకు హాస్పిటల్ నిర్వహణ బాధ్యత అప్పగించడం వల్ల వైద్యంపై దృష్టి సారించలేని పరిస్థితులు ఉంటున్నాయని తెలిపారు. నిర్వహణ విభాగాన్ని వేరు చేయాలన్న ఆలోచన చేస్తున్నామని, ఆసుపత్రుల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమిస్తామని చెప్పారు.



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చర్చ చూస్తుంటే నవ్వొస్తుంది

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** సభలో బీఆర్ఎస్ సభ్యులు పద్దులపై చర్చను పక్కనబెట్టి, గత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలన గురించి గొప్పలు చెప్పుకోవడమే లక్ష్యంగా మాట్లాడటం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. గురువారం అసెంబ్లీలో మహిళా శిశు సంక్షేమం పంచాయతీరాజ్ పద్దులపై జరుగుతున్న చర్చ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చర్చ జరపకుండా గత ప్రభుత్వం గొప్పలు చేసిందని చెప్పడానికి ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదన్నారు. పెళ్లై బిడ్డ సంకలోకి వచ్చినా కల్యాణ లక్ష్మి చెక్కు అందలేదని, ఎమ్మెల్యే సునీత చేసిన వ్యాఖ్యలు వాస్తవమైతే, ఆ ఆలస్యానికి గల కారణాలను ప్రభుత్వం ఖచ్చితంగా పరిశీలిస్తుందన్నారు.

**రూ.40 వేల కోట్లకు పైగా నిధులు...**

సాధారణంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి జాప్యం జరగడం లేదు. ఒకవేళ ఎక్కడైనా ఆలస్యం జరిగితే అది ఎమ్మెల్యే సంతకం లేకపోవడం, దరఖాస్తు చేయడంలో జాప్యంతో కానీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో జరిగి ఉండవచ్చని, దీనిపై పూర్తి వివరాలను సభ ముందు ఉంచుతామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రజలకు నీళ్లు ఇవ్వడం కోసం తెచ్చిందా, లేక పైపుల కంపెనీల ప్రయోజనం కోసం తెచ్చిందో చెప్పాలన్నారు. ఈ పథకం కోసం దాదాపు రూ. 40 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, లక్షా 23 వేల కిలోమీటర్ల మేర పైపులు వేశామని లెక్కలు చెప్పారు. కానీ ఎక్కడో దూరం నుంచి నీళ్లు తెచ్చి, ఫిల్టర్ చేసి పంపిణీ చేసే విధానం క్షేత్రస్థాయిలో ఎక్కడా సక్రమంగా అమలు కాలేదన్నారు. తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా మిషన్ భగీరథ సక్రమంగా పనిచేయడం లేదు. ఎక్కడ చూసినా పైపుల లీకేజీలు, పగిలిన పైపులతో నీరు వృథా అవుతోంది కానీ ప్రజలకు మాత్రం అందడం లేదు.

**బీఆర్ఎస్‌కు చురకలు...**

ఖమ్మం జిల్లా కొణిజర్ల నుంచి ఎర్రుపాలెం వరకు వేసిన పైప్‌లైన్ ద్వారా సరిగ్గా నీరు అందిన పరిస్థితి లేదు. కేవలం లీకేజీలు, మరమ్మతులతోనే కాలం గడుస్తోంది. కొత్త పథకం పేరుతో స్థానిక నీటి వనరులను నిర్లక్ష్యం చేయడమే కాకుండా, అప్పటికే పనిచేస్తున్న పాత నీటి పథకాలకు తాళాలు వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. మిషన్ భగీరథ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమైతే ఒక కమిటీ వేసి ఊరూరా తిరిగి నీటి పంపిణీ ఎలా జరుగుతుందో, క్షేత్రస్థాయి వాస్తవాలు ఏంటో ప్రత్యక్షంగా పరిశీలన చేద్దామన్నారు. ప్రతిపక్ష నేతలు సభను, ముఖ్యమంత్రిని, మంత్రులను గౌరవించి మాట్లాడాలి. సభా మర్యాదలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం పద్ధతిగా ఉంటుందని చురకలు వేశారు. సునీత లక్ష్మా రెడ్డి ఎవరికి కళ్యాణ లక్ష్మి పథకం రాలేదో వారి వివరాలు ఇస్తే ఎంఆర్‌ఓ ఆర్డీఓలను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామని, వెంటనే ఆ డబ్బులు కూడా ఇప్పిస్తామన్నారు. తులం బంగారం పథకం ఇంకా మొదలు పెట్ట లేదని, బీఆర్ఎస్‌నేతలు చాలా వక్ధానాలు చేసి, అసలే చేయకుండా పోయారు.మాకు ఇంకా సమయం ఉందని ఏం ఎం చేయాలో చేస్తామన్నారు. కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం దళితున్ని ముఖ్యమంత్రిని చేయలేదని, మూడు ఎకరాల భూమి పంపిణీ చేయలేదన్నారు. వాస్తవాలు ప్రశ్నిస్తే ప్రతిపక్ష నేతలకు కోపం ఎందుకు అన్నారు.

## విపక్షాల విష ప్రచారం సరికాదు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** పెట్టుబడులపై విపక్షాలు చేస్తున్న విష ప్రచారం సరికాదని, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తుంటే ఓర్వలేకపోతున్నారని, స్వార్థ రాజకీయాల కోసం మాపై కోపంతో చేసే ఈ తప్పుడు ప్రచారం రాష్ట్రానికి మంచిది కాదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. గురువారం శాసనసభలో సభ్యులు కాటిపల్లి వెంకటరమణా రెడ్డి, పాయల్ శంకర్, ధన్ పాల్ సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, 2024, 2025 దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి మొత్తం 44 ఎంవోయూలను వివిధ కంపెనీలతో కుదుర్చుకుందని, ఈ పెట్టుబడుల గ్రౌండింగ్ వివిధ దశల్లో ఉన్నాయని, ఫలితంగా కొత్తగా 68,150 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందని తెలిపారు.

**ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలో ఫ్యాక్టరీలు..**

ఆదిలాబాద్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ, ఖమ్మం జిల్లాలో స్పాంజి ఐరన్ పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ కోసం పాయల్ శంకర్ తో కలిసి చాలా సార్లు కేంద్ర మంత్రిని కలిశామని గుర్తు చేశారు. ఖమ్మంలో స్పాంజ్, ఐరన్ పరిశ్రమ ఏర్పాటుపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, భట్టి విక్రమార్కలతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనిపై త్వరలోనే కేంద్ర మంత్రి ప్రకటించే అవకాశం ఉందని తెలిపారు. టైర్ 2, టైర్ 3 పట్టణాలు, నగరాల్లో పారిశ్రామికాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, పదేళ్ల తర్వాత ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ఆధ్వర్యంలోని మా ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అన్ని ఐటీ టవర్లలో పనిచేస్తున్నవారు హైదరాబాద్ పై ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. అన్ని ఐటీ టవర్లకు మరో మూడేండ్ల పాటు రెంటల్ చార్జీలను మినహాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.


**టీ-ఫైబర్ పై కేంద్రం ప్రశంసలు..**

'లాస్ట్ మైల్ కనెక్టివిటీలో మన 'టీ ఫైబర్'ను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఓ రోల్ మోడల్ గా నిలిపాం. ఇది మేం చెప్పింది కాదు. సాక్షాతూ కేంద్రమే చెప్పింది. రాష్ట్రంలోని అన్ని రైతు వేదికలు, ప్రభుత్వ కార్యాలయాలకు 'టీ ఫైబర్' ద్వారా ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించాం. గతంలో సెక్రటేరియట్ లో ప్రైవేటు సంస్థ ద్వారా ఇంటర్నెట్ అందించేవారని, కానీ మా ప్రభుత్వం వచ్చినా తర్వాత టీఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ అందిస్తున్నాం' అని తెలిపారు.

**2001లో 294 ఎమ్మెల్యేల విదేశీ పర్యటనలు..**


'2001 కొత్తగా ఎమ్మెల్యే అయ్యాను. చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు 294 మంది శాసనసభ్యులను విదేశీ పర్యటనలకు తీసుకెళ్లారు. ఆ అనుభవం ఎంతో ఉపయోగపడింది. మూసీ సుందరీకరణ కోసం దక్షిణ కొరియాలో అధ్యయనం నగరానికి చెందిన అన్ని పార్టీలకు సభ్యులను ఆహ్వానించాం. చాలామంది రాలేదు. మా సభ్యులు సొంత ఖర్చులతో వెళ్లారు. దీనిపై ప్రతిపక్ష సభ్యుల విమర్శలు సరికావు' అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

## అసెంబ్లీ నడుస్తుంటే ఆటలేంటి?



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు అత్యంత కీలకమైన పద్దులపై చర్చలతో కొనసాగుతున్న తరుణంలో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించడం ఏంటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడారు. ఇంత సీరియస్‌గా సభ జరుగుతున్న సమయంలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ఏంటని నిలదీశారు. ఇదే విషయాన్ని తాను మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వద్ద ఎటువంటి సమాధానం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ఇరిగేషన్ వంటి అత్యంత ముఖ్యమైన సబ్జెక్టులపై సభలో లోతైన చర్చ జరగాల్సి ఉన్నదని.. కానీ ప్రభుత్వం మాత్రం పద్దులపై చర్చను త్వరగా ముగించి పారిపోవాలని చూస్తున్నదని విమర్శించారు. కీలకమైన అంశాలపై చర్చలు జరగాల్సిన సమయంలో ఎమ్మెల్యేలు మైదానాల్లో ఆటలు ఆడుతుంటే చూస్తున్న ప్రజలు ఏమనుకుంటారని నిలదీశారు. ఈ నెల 28, 29 తేదీల్లో ఈ క్రీడా పోటీలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల కాలాన్ని ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించకుండా, ఇలాంటి కార్యక్రమాలతో కాలయాపన చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. చర్చించాల్సిన కీలకమైన అంశాలు పక్కనపెట్టి కేవలం ప్రతిపక్షాలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే ఈ క్రీడా పోటీలను ఒక సాకుగా చూపిస్తున్నదని మండిపడ్డారు. అసెంబ్లీ నడపడం చేతకాదు కానీ.. ఈ ఆటలపోటీలు ఏంటని ప్రశ్నించారు.

## జగ్గారెడ్డిపై మనుషుల అక్రమ రవాణా కేసు.. కోర్టు కీలక తీర్పు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి భారీ ఊరట లభించింది. మానవ అక్రమ రవాణా కేసులో జగ్గారెడ్డితో పాటు కాంగ్రెస్ నేత కుసుమ కుమార్‌పై నమోదైన కేసును ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నమోదు చేసిన ఈ కేసులో A1 గా ఉన్న జగ్గారెడ్డి, A3గా ఉన్న కుసుమ కుమార్‌ల కేసులో నేరాలు రుజువు కాలేదని వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది.కాగా 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జగ్గారెడ్డి నకిలీ డాక్యుమెంట్లు సమర్పించి భార్య పిల్లలుగా పేర్కొంటూ వేరే ముగ్గురు వ్యక్తులను అమెరికాకు తీసుకువెళ్లారని ఆరోపణలు ఉన్నయి. తన వెంట ఒక మహిళ ఒక యువకుడిని అమెరికా తీసుకువెళ్లిన జగ్గారెడ్డి తిరిగి ఆయన ఒక్కరే భారత్‌కు తిరిగి వచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. నాడు ఎమ్మెల్యేగా, విప్ గా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ 2018లో ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం బెయిల్ పై ఆయన బయటకు వచ్చారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి కోర్టు తీర్పు వెలువరించింది.

## అన్ని రాష్ట్రాల సీఎంలతో నేడు ప్రధాని సమావేశం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోడీ మార్చి 27న వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**ఆ సీఎంలు దూరంగా..**

వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధానిసీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం.
ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోడీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలున్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## కన్నుల పండుగల శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించాలి: ఉపేందర్ రెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్** : కన్నుల పండుగల శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించాలి అని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ రామ నవమి సందర్భంగా నిర్వహించే శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి హాజరుకావాలని చిలుక ఉపేందర్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, కళ్యాణం రోజున 3000 మంది భక్తులకు సరిపడా అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి సహకరించవలసినదిగా కోరగా వారు వెంటనే స్పందించి అన్నప్రసాద వితరణ కైకర్యానికి సంబంధించిన మొత్తం ఖర్చులను భరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ గుణిగంటి వెంకట్ గౌడ్, చంద్రమౌళి, తలాటి రమేష్, సంతోష్, రమేష్, వినయ్, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.



### 'ఏఐ' తీర్పుల ప్రస్తావన..

## సుప్రీం కోర్టు ఆందోళన

- ప్రపంచవ్యాప్తంగా న్యాయస్థానాల్లో ఈ సమస్య అంతకంతకూ పెరుగుతోంది
- సుప్రీం కోర్టు ధర్మాసనం



**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** కృత్రిమ మేధ ద్వారా సృష్టించిన తీర్పులను.. కక్షిదారులు, న్యాయవాదులు ఉటంకిస్తున్న తీరుపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా న్యాయస్థానాల్లో ఈ సమస్య అంతకంతకూ పెరుగుతోందని జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం తెలిపింది.


**అసలేం జరిగింది..?**

ఓ కంపెనీ డైరెక్టర్‌కు సంబంధించిన కేసును గతంలో బాంబే హైకోర్టు విచారించింది. ఇందులో భాగంగా ఆ డైరెక్టర్ దాఖలు చేసిన రాతపూర్వక అంశాలను పరిశీలించి.. చాట్‌జీపీటీ, లేదా అటువంటి ఏఐ టూల్‌స్‌ను ఉపయోగించి రూపొందించినట్లు భావిస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఓ కేసును కూడా ప్రస్తావించారని, అయితే..దాని ప్రతిని అందించలేదని తెలిపింది. దాని గురించి తెలుసుకునేందుకు కోర్టు సిబ్బంది ప్రయత్నించినా..ఫలితం లేకపోయిందని చెప్పింది. దీంతో విలువైన కోర్టు సమయం వృథా అయ్యిందని పేర్కొంది. అయితే, చాట్‌జీపీటీ ఉపయోగించారంటూ బాంబే హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొన్న వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ కంపెనీ డైరెక్టర్.. సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇందుకు అంగీకరించిన సర్వోన్నత న్యాయస్థానం.. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టుల్లోనూ ఇటువంటి సమస్య ఉందని పేర్కొంది. ప్రతి ఒక్కరూ ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

### ఒకే ఒక్క క్లిక్.. అరచేతిలో

## 'భూమి' సమాచారం!

- తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోంది
- రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యం
- ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ఏప్రిల్ 2న ప్రయోగాత్మకంగా అమలు
- రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందికి తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేస్తున్నాం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని, గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ (ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను వచ్చే నెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఎన్ఐసీ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందికి తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి భూ లావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా పోర్టల్‌ను ఉంటుందన్నారు.
ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ పైలెట్ మండలాల్లో మెరిట్ డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండో దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని, ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూ భారతి పోర్టల్‌ను కూడా తీసుకొచ్చామన్నారు. భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జత పరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ మాదిరిగానే భూధార్ నంబర్‌ను ఇస్తామన్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షా లేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నంబర్లను కేటాయించినట్లు తెలిపారు. ఒక క్లిక్‌తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా, చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు. ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదే విధంగా పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మై ల్యాండ్ పోర్ట్ ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వే నంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్ వంటి పూర్తి సమాచారం ఉంటుందన్నారు. అన్ని రకాల సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూ భారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్ఎంఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.

## హాస్టల్ ను సందర్శించిన ఎంపీడీవో

**విశ్వంభర, వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిషత్ అధికారి జలంధర్ రెడ్డి ప్రత్యేక అధికారి దుర్గ తో కలిసి కేజీబీవీ హాస్టల్ ను సందర్శించి సిబ్బంది హాజరు నమోదు పుస్తకం స్టాక్ రిజిస్టార్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసారు. విద్యార్థులతో పాటు ఫుడ్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. విద్యుత్ సమస్య కారణంగా నీటి సరఫరా ఇబ్బంది ఉన్నట్లు గుర్తించారు. వేసవికాలం ప్రారంభమైన సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు.



## ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం అసెంబ్లీ ముట్టడి

**విశ్వంభర, హైదరాబాదు :** రాష్ట్రంలో ఖాళీ ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ, ఎన్నికల హామీలైన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలు చేయకపోవడాన్ని విమర్శించారు. రాష్ట్రంలో పెద్దఎత్తున ఖాళీలు ఉన్నప్పటికీ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదన్నారు. ఉద్యోగాలు కల్పించే వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన నాయకులను పోలీసులు అరెస్టు చేశారని, రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు అరెస్టులు జరిగినట్లు తెలిపారు. అసెంబ్లీ సమీపంలో జరిగిన ఉద్రిక్తతలో కొంతమంది నాయకులు గాయపడ్డారని, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల చర్యలను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జావీద్, గడ్డం వెంకటేష్, మల్లం మహేష్, కృష్ణ నాయక్, జగన్, మధు, ప్రశాంత్, శ్రీనివాస్, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ఉద్యోగుల శ్రమదోపిడీ ఆపాలి



**విశ్వంభర, ముషీరాబాదు :** కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి కనీస వేతనాలు అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో వక్తలు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాదు ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా భారీగా నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, ఈ విభాగాల ఉద్యోగులకు దీర్ఘకాలంగా తక్కువ వేతనాలు చెల్లించడం అన్యాయమని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేసి సమస్యలను శాసనసభలో ప్రస్తావిస్తానన్నారు. కె నాగేశ్వర్ మాట్లాడుతూ విద్యారంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులకు సర్వీసుల క్రమబద్ధీకరణ అవసరమన్నారు. ఎం సంయుక్త మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన సెలవులు, మరణించిన సందర్భంలో ఎక్స్‌గ్రేషియా కల్పించాలని డిమాండ్ చేశారు. చావ రవి మాట్లాడుతూ, వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, దేశవ్యాప్తంగా ఒకే విధమైన వేతన విధానం అమలు చేయాలని కోరారు. ఎ వెంకట్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి మధు, దుర్గా భవాని, టి లక్ష్మారెడ్డి, విశాలాక్షి, లక్ష్మి, మంజుల, గోపిలత, యాదగిరి, పాషా, సురేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భవనం పై నుండి దూకి వివాహిత ఆత్మహత్య



**విశ్వంభర, చైతన్యపురి :** భవనం పై నుండి దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం చైతన్యపురి హనుమాన్ నగర్ లో మన్య శివకుమార్, మాధవి లు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కొడుకులు సంతానం. భార్యాభర్తల కలహాల నేపథ్యంలో వాళ్ళు నివాసం ఉంటున్న బిల్డింగ్ పై నుండి దూకింది. క్రిందకు దూకగా బలమైన గాయాలు అవటంతో వెంటనే ఆమె భర్త దగ్గరలో ఉన్న ఓమ్ని ఆసుపత్రికి తీసుక వెళ్ళి చేర్పించగా చికిత్స పొందుచూ మృతి చెందింది. మృతురాలి మరణములో ఆమె భర్త శివకుమార్ పై అనుమానము ఉన్నదని మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నేడు శ్రీరామ నవమి వేడుకలు



**విశ్వంభర, చైతన్యపురి :** చైతన్యపురి డివిజన్ సాయి నగర్ కాలనీలో నీ ప్రసన్నాంజనేయ సహిత శివాలయ దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని దేవాలయ చైర్మన్ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు . భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లతో పాటు అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు ఈ నవమి వేడుకల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అనుగ్రహం పొందాలని కోరారు.

## నీటి పారుదల పనులకు నిధులు

### - ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితో మంజూరు



**విశ్వంభర, సిద్దిపేట:** నియోజకవర్గంలో నీటి పారుదలకు సంబంధించిన పనులకు రూ.1కోటి 7లక్షల 85వేల నిధులు మంజూరయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు గురువారంనాడొక ప్రకటనలో తెలిపారు. రూరల్ మండలం రాఘవాపూర్ మధిర గ్రామం ఇంద్రగూడెం రైతులు గ్రామంలోని పల్లెకుంట, మొండి కుంటలను పునరుద్ధరించాలని ఇటీవల ఎమ్మెల్యేకు విన్నవించారు. రైతుల వినతితో పునరుద్ధరణకు రూ.48లక్షల 20వేలు మంజూరు చేశారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి నుంచి గుండ్ల చెరువు ఫీడర్ ఛానల్‌కు వెళ్లే బ్రిడ్జి ఇటీవల వర్షాలకు కూలింది. దీంతో పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని, రాకపోకలు బంద్ అయ్యాయని రైతులు హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఇబ్బందుల దృష్ట్యా నూతన బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని అందుకు రూ.47లక్షల 20వేలు మంజూరయ్యాయని తెలిపారు. నంగునూర్ మండలం ముండ్రాయి గ్రామం మెరుపుకుంట ఇటీవల వర్షాలకి దెబ్బతింది. కుంటకు శాశ్వతంగా మరమ్మతు చేయాలనే రైతుల విజ్ఞప్తితో రూ.12లక్షల 45వేలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా పనులు త్వరితగతిన ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# పీఆర్సీ నివేదికను వెంటనే ఆమోదించి అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వం 4 డీఏలను పెండింగ్‌లో పెట్టడం సరికాదు
- ఉపాధ్యాయుల ఆర్థిక హక్కులను కాలరాయవద్దు
- పెన్షనర్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం కోర్టులకు వెళ్లాల్సి రావడం దురదృష్టకరం
- పెండింగ్ బిల్లుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి
- వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను చేపట్టాలి
- టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్





**విశ్వంభర, రంగారెడ్డి జిల్లా:** తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎం. రమేష్ గౌడ్ అధ్యక్షతన గురువారం కిన్నెర గ్రాండ్ హాల్ లో నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్య వైఖరిని తీవ్రంగా నిరసించారు. 01.07.2023 నుండి అమలు కావాల్సిన పీఆర్సీ నివేదికను ప్రభుత్వం ఇప్పటి వరకు స్వీకరించకపోవడం శోచనీయమని, గడువును మళ్లీ పొడిగించకుండా వెంటనే నివేదికను తీసుకొని కొత్త పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు డీఏలను ప్రకటిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం 4 డీఏలను పెండింగ్‌లో పెట్టడం సరికాదని, ఉపాధ్యాయుల ఆర్థిక హక్కులను కాలరాయవద్దని పేర్కొన్నారు.ముఖ్యంగా పెన్షనర్లు తమ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం కోర్టులకు వెళ్లాల్సి రావడం దురదృష్టకరమని, వారి ఆరోగ్య మరియు ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పెండింగ్ బిల్లుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. అలాగే సర్వీస్ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. పదవ తరగతి స్పాట్ వాల్యూయేషన్ ప్రారంభమవుతున్న తరుణంలో, గతంలో జరిగిన మూల్యాంకనానికి సంబంధించిన పాత రెమ్యూనరేషన్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### విద్యార్థుల మానసిక వేదనను దూరం చేసేలా

# సర్కార్ అడుగులు






**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ రాష్ట్ర శాసన మండలి హాల్‌లో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 0-10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం, విద్యాభ్యాస స్థాయి సామర్థ్య లోపాలకు సంబంధించిన పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ దృష్టికి తెచ్చారు. చిన్న వయసులో పోషకాహార లోపం వల్ల భవిష్యత్తులో తలెత్తే ఆరోగ్య సమస్యలు, ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన వివరించారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను సూచించారు. ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందించేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందించేందుకు "పోషణ సఖి" పేరుతో మరొకరిని నియమించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కార్తీక్ మురళీధరన్ సూచించిన అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (CURE) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌లలో ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కార్తీక్ మురళీధరన్‌తో సమన్వయం చేసుకుని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

## నెహ్రూ జూ పార్క్‌లో కొత్త అతిథులు





### * మాండ్రిల్ కోతుల సందడి

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో కొత్త జాతి జంతువుల చేరికతో సందడి నెలకొంది. తాజాగా రెండు మగ మాండ్రిల్ కోతులను ప్రజల వీక్షణార్థం ప్రైమేట్ పార్క్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన అటవీ సంరక్షణ అధికారి, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ విజయ్ కుమార్ జూలాజికల్ పార్క్‌ను సందర్శించి, సుమారు 23 నెలల వయస్సు గల రెండు కోతులను ఎన్‌క్లోజర్‌లో విడుదల చేశారు. ఈ మాండ్రిల్ కోతులు జంషెడ్‌పూర్ జూ తో జరిగిన జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఇక్కడకు తెచ్చారు. దీనికి ప్రతిగా హైదరాబాద్ జూ ఒక జత ఆఫ్రికన్ సింహాలను అందించింది. గత నెలలో వచ్చిన ఈ జంతువులను 45 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచి, అన్ని పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాక ప్రజల ముందు ప్రదర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జూ పార్కుల డైరెక్టర్ డాక్టర్ సునీల్ హిరేమత్, నెహ్రూ జూలాజికల్ పార్క్ క్యూరేటర్ వసంత, జూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ, నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో జంతువుల సంఖ్యను పెంచడానికి అటవీ శాఖ, జూ యాజమాన్యం కృషి చేస్తోందని చెప్పారు. కొత్త జాతుల చేరికతో రాబోయే వేసవి కాలంలో సందర్శకుల సంఖ్య మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో 196 జాతులకు చెందిన 2100కు పైగా జంతువులు ఉన్నాయి.

### బీసీ హాస్టళ్ల మెస్ బిల్లులు, ఫీజు రీయింబర్స్‌మెంట్

# బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- ఆర్. కృష్ణయ్య, గుజ్జ సత్యం



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలోని బీసీ కాలేజీ హాస్టళ్లు , ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు సంబంధించిన మెస్ బిల్లులు, హాస్టల్ అద్దె బిల్లులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వారు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి రాష్ట్రంలోని బీసీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గత ఆరు నెలలుగా బీసీ కాలేజీ హాస్టళ్లు, ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు సంబంధించిన మెస్ బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ తీవ్ర సంక్షోభంలో పడిందని వారు తెలిపారు. హాస్టళ్లకు కూరగాయలు, గుడ్లు, మాంసం, పప్పులు, నూనెలు వంటి నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్న వ్యాపారులకు నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే హాస్టళ్లకు అవసరమైన సరఫరాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోని చాలా బీసీ హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, అయితే నెలలుగా అద్దె బిల్లులు చెల్లించకపోవడంతో భవన యజమానులు హాస్టళ్లను ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థుల వసతి, చదువుపై ప్రతికూల ప్రభావం పడే పరిస్థితి ఏర్పడుతోందని వారు పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వేల కోట్ల రూపాయలకు పెరిగిపోయాయని, దీని వల్ల వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్య కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**విశ్వంభర, అంబర్‌పేట :** అంబర్‌పేట డివిజన్ న్యూ పటేల్ నగర్‌లో రూ.18 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని డ్రైనేజీ, సివరేజ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్, ఆర్ఎస్ లవంగం ఆంజనేయులు, మల్లేష్ యాదవ్, మహేష్ ముదిరాజ్, వంజరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





## పీడీఎస్‌యూ రాష్ట్ర వ్యాప్త బంద్ విజయవంతం

**విశ్వంభర, మలక్ పేట్ :** పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ ,స్కాలర్షిప్స్ బకాయిల విడుదలకై ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) తలపెట్టిన రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ,ఇంజనీరింగ్,పీజీ ప్రొఫెషనల్ కళాశాలల బంద్ ను గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో విద్యానగర్, ఓయూ,నారాయణగూడ దిల్ సుఖ్ నగర్ ప్రాంతాలలో బంద్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.మహేష్,పొడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మంద నవీన్,కే. శ్రీనివాస్ లు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ప్రభుత్వ నుండి రావలసిన బకాయిలు 10వేల కోట్లు ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయకుండా ప్రభుత్వం పేద,బడుగు,బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ ప్రత్యక్షంగా ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో విద్యారంగానికి అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్పులను సకాలంలో విడుదల చేస్తాం,విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తాం అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేటికీ 25 నెలలు పూర్తవుతున్న విద్యార్థులకు రావలసిన 10వేల కోట్ల బకాయిలు విడుదల చేయకపోవడం సిగ్గు చేటు అని అన్నారు. లక్షలాదిమంది విద్యార్థులు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ ప్రొఫెషనల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యా సంవత్సరం పూర్తయిన రియంబర్స్మెంట్ రాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజు మొత్తం చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామని చెబుతున్నారని అన్నారు. తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షాన పెద్ద ఎత్తున విద్యార్థి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు తీగల శ్యామ్. సహాయ కార్యదర్శిలు కే.ఝాన్సీ,జి. యశ్వంత్, జిల్లా నాయకులు గణేష్ లు పాల్గొన్నారు.


## బొమ్మగాని ధర్మ బిక్షం వర్ధంతి



**విశ్వంభర, సూర్యాపేట :** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమ శిఖరం, నల్గొండ మాజీ పార్లమెంట్ సభ్యులు బొమ్మగాని ధర్మ బిక్షం వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘనంగా నివాళులర్పిస్తున్నాను. బడుగు వర్గాలకు హక్కులు, సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన వారి ఉద్యమ స్ఫూర్తి అందరికి ఆదర్శం. ధర్మభిక్షం ప్రజానేత, పేదల పక్షపాతి. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, సీనియర్ ప్రజా ప్రతినిధి, తెలంగాణ సాయుధ పోరాట యోధులు బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో నివాళులు అర్పించారు. బొమ్మగాని ధర్మబిక్షం ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, స్వతంత్ర సమరయోధులని అని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) నుంచి నల్గొండ లోక్‌సభ నియోజకవర్గం ఏం.పి.గా 10, 11వ లోక్‌సభ సభ్యులుగా పనిచేశారని. అంతకు ముందు సూర్యాపేట (1952), నకిరేకల్ (1957), నల్లగొండ (1962) శాసనసభ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యే గా ధర్మభిక్షం హ్యాట్రిక్ విజయాలు సాధించారని మహేష్ కుమార్ గౌడ్ గుర్తు చేసుకున్నారు. నిజాయితీకి మారు పేరు గా, క్రమశిక్షణ తో, సిద్ధాంతాల కోసం బతికున్నంత కాలం ప్రజల కోసం పని చేసిన ధర్మభిక్షం రాజకీయ జీవితం నేటి యువతరానికి ఆదర్శమని అన్నారు.

## వైద్యులు అందుబాటులో ఉండాలి

### - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**విశ్వంభర, బచ్చన్న-పేట:** జనగాం జిల్లా బచ్చన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది రిజిస్టర్, ఓపీ రిజిస్టర్, పిల్లల వార్డు, ఇన్ పేషంట్ వార్డులను, మందుల నిల్వలను పరిశీలించారు. ఓపీ ద్వారా ప్రతి రోజు ఎంత మంది వైద్యం పొందుతున్నారు, ఆసుపత్రిలో ఎన్ని ప్రసవాలు జరిగాయి అని వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను మరింతగా పెంచాలని, అందుకు తగ్గట్లుగా వైద్యాధికారులు, ఆశాలు పని చేయాలన్నారు. ఇన్ పేషంట్ వార్డులోకి వెళ్లి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రి లోపల, పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించాలని, చెట్లను సంరక్షిస్తూ పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. అనంతరం మండలంలోని మన్సాన్ పల్లి, లింగంపల్లి, కొన్నె, రామచంద్రాపురం, ఇటిక్యాల పల్లి గ్రామాల్లో జరుగుతోన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ నేపథ్యంలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతాప్రమాణాలను తప్పకుండా పాటించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని వెల్లడించారు. మన్సాన్ పల్లి అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ మాత్రు నాయక్, అధికారులున్నారు.

# రాజధాని 2వ దశకు మాస్టర్‌ప్లాన్, ఆర్థిక ప్రణాళిక

**సింగపూర్ సంస్థ సుర్బానా జురాంగ్‌కు బాధ్యతలు**
**రెండో దశలో మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించనున్న ఆర్వీ అసోసియేట్స్**
**గ్లోబల్ టెండర్ల ద్వారా మూడు సంస్థలను ఎంపిక చేసిన సీఆర్‌డీఏ**
**ఆరు నెలల్లో సిద్ధం చేయాలని గడువు**



**విశ్వంభర, ఏపీ బ్యూరో:**
రాజధాని అమరావతి 2వ దశ మాస్టర్ ప్లాన్ రూపకల్పన బాధ్యతను సింగపూర్?కి చెందిన సుర్బానా జురాంగ్ సంస్థకు సీఆర్‌డీఏ అప్పగించింది. మౌలిక వసతుల ప్రణాళిక రూపకల్పనకు ఆర్వీ అసోసియేట్స్?ని కన్సల్టెన్సీ సంస్థగా ఎంపిక చేసింది. రాజధాని 2వ దశ ఆర్థిక ప్రణాళిక బాధ్యతను నైట్ ఫ్రాంక్ కన్సల్టెన్సీకి అప్పగించింది. 6 నెలల్లో 2వ దశ మాస్టర్?ప్లాన్ సిద్ధం చేయాలని సీఆర్‌డీఏ గడువు విధించింది.రాజధాని అమరావతి 2వ దశకు మాస్టర్ ప్లాన్?తో పాటు, ఆర్థిక ప్రణాళికనూ ఒకేసారి సిద్ధం చేయాలని సీఆర్?డీఏ నిర్ణయించింది. ఇటీవల గ్లోబల్ టెండర్లు పిలిచిన సీఆర్?డీఏ మాస్టర్?ప్లాన్ రూపకల్పన బాధ్యతను సుర్బానా జురాంగ్ సంస్థకు, మౌలిక వసతుల రూపకల్పన బాధ్యతలు ఆర్వీ అసోసియేట్స్?కు, ఆర్థిక ప్రణాళిక బాధ్యత నైట్ ఫ్రాంక్ కన్సల్టెన్సీ సంస్థకు అప్పగించింది. రాజధాని తొలి దశకు మాస్టర్ ప్లాన్‌ను సుర్బానా జురాంగ్, తొలిదశ మౌలిక వసతుల ప్రణాళికను ఆర్వీ అసోసియేట్స్‌సంస్థలే రూపకల్పన చేశాయి. అమరావతి భౌగోళిక స్వరూపం, ఇక్కడి పరిస్థితుల పై ఆ 2 సంస్థలకు కూడా పూర్తి అవగాహన ఉండటం 2వ దశ మాస్టర్‌ప్లాన్‌ని వేగంగా, సమగ్రంగా రూపొందించేందుకు దోహదం చేస్తుంది అని సీఆర్‌డీఏ భావిస్తోంది. తొలి దశలో రాజధాని అమరావతికి 217 చదరపు కి.మీ. ప్రాంతానికి సుర్బానా జురాంగ్ సంస్థ మాస్టర్?ప్లాన్ రూపొందించింది. 2015 మే 25న రాజధాని మాస్టర్?ప్లాన్?ను, 2015 జులై 20న సీడ్ కేపిటల్ డెవలప్?మెంట్ ప్లాన్‌ను సుర్బానా జురాంగ్ రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. మళ్లీ 11 ఏళ్ల తర్వాత రాజధాని 2వ దశకు మాస్టర్ ప్లాన్ రూపొందించడం గమనార్హం. అమరావతి విస్తరణ ప్రణాళికలో భాగంగా 2వ దశలో మొత్తం 709 చదరపు కి.మీ. ప్రాంతానికి మాస్టర్?ప్లాన్? సిద్ధం చేస్తుంది. ఈ పరిధిలో మొత్తం 50 గ్రా మాలు ఉన్నాయి. వాటిలో కేవలం 7 గ్రామాల్లో ఇప్పటికే భూ సమీకరణ నోటిఫికేషన్ జారీ చేశారు.
మిగతా ప్రాంతంలో వచ్చే ప్రాజెక్టుల్ని బట్టి ఎక్కడ అవసరమైతే అక్కడ భూ సమీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాకపోతే రాజధాని మాస్టర్?ప్లాన్?ను మాత్రం మొత్తం 709 చదరపు కి.మీ. ప్రాంతానికి ముందుగానే రూపొందించాలని భావిస్తున్నారు.ప్రస్తుత రాజధానిని ఆనుకుని ఉత్తరాన కృష్ణా నది నుంచి దక్షిణాన అవుటర్ రింగ్ రోడ్డు వరకు, తూర్పున చెన్నై–కోల్?కతా నేషనల్ హైవే వరకు ఉన్న ప్రాంతానికి మాస్టర్?ప్లాన్? తయారు చేస్తున్నారు. రాజధాని 2వ దశలో ప్రస్తుతం భూసమీకరణ చేస్తున్న 7 గ్రామాల్లో ప్రభుత్వ, దేవాదాయ భూములు, చెరువులు, కుంటలు వంటివి అన్నీ కలిపి మొత్తం 20,494 ఎకరాలు ఉన్నాయి. మిగతా 43 గ్రామాల్లో 1,54,853 ఎకరాల విస్తీర్ణం ఉంది. మొత్తంగా 2వ దశలో 1,75,347 ఎకరాలకు మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తారు. రాజధాని అమరావతి తొలి దశ మాస్టర్‌ప్లాన్‌ని నవ నగరాల కాన్సెప్ట్‌తో రూపకల్పన చేశారు. వాక్ టు వర్క్ అన్న నినాదంతో హరిత, నీలి నగరంగా అమరావతిని సిద్ధం చేస్తున్నారు. మొత్తం రాజధాని ప్రాంతంలో 30 శాతం పైగా ప్రాంతంలో హరిత వనాలు, జలాశయాలు, కాలువలు కూడా అభివృద్ధి చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతుల ప్రణాళిక రూపకల్పన చేశారు. కొత్తగా విస్తరించే ప్రాంతాలు అన్నీ తొలి దశతో అనుసంధానించేలా అదే స్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా ప్లాన్ రూపొందించనున్నారు.ఏ ప్రాంతం లో ఎలాంటి పరిశ్రమలు, ప్రాజెక్టులు, డెవలప్మెంట్ నోడ్‌లు ఏర్పాటు చేయాలి వంటి స్పేషియల్ ప్లానిం గ్‌తో పాటు, ట్రంక్ రోడ్లు, రవాణా, తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థ, విద్యుత్ సదుపాయం వంటి మౌలిక వసతుల ప్రణాళికలను సిద్ధం చేస్తారు.ప్రస్తుతం భూ సమీకరణ చేస్తున్న 7 గ్రామాలకు వివరణాత్మక మాస్టర్?ప్లాన్, మిగతా 43 గ్రామాలకు సంబంధించిన ఇండికేటివ్ ప్లాన్?ని సుర్బానా జురాంగ్ రూపకల్పన చేస్తుంది. రాజధాని 2వ దశలో భాగంగా స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ వంటివి ఏర్పాటు చేయనున్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు అనేక ప్రాజెక్టులకు తగ్గట్టు ఇప్పుడే మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. రాజధాని అమరావతిని రాష్ట్ర ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్?డ్? ప్రాజెక్టుగా రూపొందించింది.ప్రస్తుతం వివిధ సంస్థల నుంచి రుణాలు తీసుకొచ్చి రాజధానిని నిర్మిస్తున్నా భవిష్యత్తులో రాజధానిలో ప్రభుత్వం వద్ద మిగిలే భూముల్ని విక్రయించడం, వివిధ పన్నులు, వనరుల ద్వారా సమకూరే నిధులతో రుణాలు తీర్చాలన్నదే లక్ష్యం. రాజధాని 2వ దశకు కూడా అదే సూత్రాన్ని అమలు చేయనున్నారు. రాజధాని విస్తరణకు అవసరం అయ్యే మూలధన వ్యయం, దానికి అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణ ప్రణాళికను రూపొందించే బాధ్యతను నైట్ ఫ్రాంక్ సంస్థకు అప్పగించారు.భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు స్థలాలు కేటాయించగా సీఆర్‌డీఏకి వచ్చే భూముల్ని విక్రయించడం, జాయింట్ డెవలప్‌మెంట్, దీర్ఘకాలిక లీజు వంటి నమూనాల ద్వారా ఆర్థిక వనరుల సమీకరణకు ప్రణాళిక సిద్ధం చేయనున్నారు.

## కల్తీ పాల ఘటన.. సుమోటోగా తీసుకున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ




**విశ్వంభర, రాజమహేంద్రవరం:** తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశమైన రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనను జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా తీసుకుంది. ఈ మేరకు ఏపీ సీఎస్, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. గత నెల జరిగిన ఈ ఘటనలో ఇప్పటి వరకు 17 మంది మృతి చెందగా, పలువురు చికిత్స పొందుతున్నారు.

## పాల కోసం ఏడ్చిందని పసి ప్రాణాన్ని చిదిమేసిన కన్నతల్లి!

**విశ్వంభర, ఏపీ బ్యూరో:**



అమ్మ.. ఈరెండక్షరాల పిలుపులో అనంతమైన ప్రేమ ఉంటుంది. ఆకలితో అలమటించే బిడ్డకు అమృతంలా పాలిచ్చే ఆ తల్లి ప్రేమే లోకానికి ఆధారం. కానీ, తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలో చోటుచేసుకున్న ఒక దారుణ ఘటన చూస్తుంటే, మానవత్వం సిగ్గుతో తలదించుకుంటోంది. ఆకలితో ఏడుస్తున్న పసికందుపై కరుణ చూపాల్సిన ఆ కన్నతల్లే కాలయముడైంది. మిళనాడుకు చెందిన హైమావతి, వెంకటేష్ దంపతులు బతుకు దెరువు కోసం సత్యవేడుకు వచ్చి సిమెంట్ రాళ్ల తయారీ పనుల్లో శ్రమిస్తున్నారు. వారికి ఐదేళ్ల కుమారుడు, ఆరు నెలల పసి కూతురు ఉన్నారు. గురువారం ఉదయం ఆచిన్నారి పాల కోసం గుక్కపట్టి ఏడ్చింది. ఆ ఏడుపు ఆ తల్లిలో జాలిని నింపాల్సింది పోయి, రక్తం ఉడికించింది. పని ఒత్తిడిలో ఉందో, లేక క్షణికావేశానికి లోనైందో కానీ.. పాలు ఇచ్చి లాలించాల్సిన చేతులతోనే ఆ పసిపాప గొంతు నులిమింది.లోకం తెలియని ఆ పసిబిడ్డ, తన ఆకలి తీర్చమని తన భాషలో వేడుకుంది. కానీ, ఆ మూగ వేదన ఆ తల్లి హృదయాన్ని తాకలేకపోయింది. కాసేపటికే ఆ పసిబిడ్డ కదలికలు ఆగిపోయాయి. చిన్నారి ప్రాణం గాలిలో కలిసిపోయింది. నిశ్శబ్దంగా పడి ఉన్న ఆ చిన్నారిని చూసి కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. "బిడ్డ ఆకలి తీర్చాల్సిన తల్లి, ఆ బిడ్డ ప్రాణాన్నే తీయడం దారుణానికి పరాకాష్ట. ఆకలి కేకలు వేసిన ఆ గొంతుకను శాశ్వతంగా మూగబోయేలా చేయడం ఏ చట్టం క్షమించలేని నేరం." అంటున్నారు జనం. సమాచారం అందుకున్న సీఐ మురళీ నాయుడు, ఎస్సై సాయినాథ్ చౌదరి ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆ తల్లిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, అసలు ఇంతటి ఘాతుకానికి పాల్పడటానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. అమ్మ ఒడి అన్నది బిడ్డకు శ్రీరామరక్ష కావాలి. కానీ, అదే ఒడి మృత్యువుగా మారడం కలికాలపు వైపరీత్యం. ఆకలి కోసం ఏడ్చిన ఆ చిన్నారి చిరునవ్వు ఇప్పుడు కేవలం ఒక ఛాయాచిత్రంగానే మిగిలిపోయింది. మాతృత్వపు మమకారాన్ని ప్రశ్నిస్తున్న ఈ విషాదం ప్రతి ఒక్కరిని కలిచివేస్తోంది.

## మార్కాపురం బస్సు ప్రమాదంలో విస్తుపోయే విషయాలు

**విశ్వంభర, ఏపీ బ్యూరో:**
వరుస రోడ్డు ప్రమాదాలు తెలుగు రాష్ట్రాలను భయపెడుతున్నాయి. గురువారం తెల్లవారుజామున ఏపీలోని మార్కాపురం జిల్లాలో హారికృష్ణ ట్రావెల్స్ కు చెందిన బస్సు, టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో 13 మంది సజీవ దహనం కాగా మరో 28 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి విషయమంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదం జరిగిన తీరు, ఘటన స్థలంలోని దృశ్యాలు భీతిగొల్పేలా ఉన్నాయి. ప్రమాదానికి గురైన బస్సు కండిషన్ విషయంలో ఇప్పుడు సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. బస్సు కండిషన్ బాగోలేదని మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు కీలక విషయాలు వెల్లడించారు. ప్రమాదం జరిగే సమయానికి గంట ముందు కూడా బస్సు ట్రబుల్ ఇచ్చిందని దాంతో గంట సేపు బస్సును నిలిపివేసి రిపేర్లు చేశారని ఆ తర్వాత ప్రయాణం మొదలైన కొద్దిసేపటికే ఈ ఘోరం జరిగినట్లు తెలిపారు. ఒక వేళ ఈ గంట సమయం ప్రయాణం కూడా సాఫీగా జరిగితే ఈ గండం నుంచి తమ వారు బయటపడేవారేమోనని బాధిత కుటుంబ సభ్యులు రోధిస్తున్నారు. ప్రమాదానికి గురైన హారికృష్ణ ట్రావెల్స్ బస్సు కండిషన్ బాగోలేదని రెండు నెలల క్రితం జరిగిన సంక్రాంతి పండగ సమయంలోనే బయటపడినట్లు తెలుస్తోంది. ఆర్టీఏ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో బస్సు కండీషన్ బాగోలేదని రూ.36 వేల జరిమానా విధించారని అధికారులు వెల్లడించారు. ఈ జరిమానాతోనైనా బస్సు కండీషన్ మెరుగు పరిచి ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించి ఉంటే ఇవాళ ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదేమో అని బాధితులు చెబుతున్నారు. కానీ కాసుల కక్కుర్తికి ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టి యాజమాన్యం కండిషన్ సరిగా లేకపోయినా, డ్రైవర్ల పట్ల సరైన నిఘా లేకుండా సర్వీసులు నడుపుతుండటంతో గురువారం 13 మంది నిండు ప్రాణాలు బూడిదపాలయ్యాయని



బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఒక విషాదం నుంచి తేరుకోక ముందే మరో ఘోరం వెంటాడుతోంది. తాజాగా జరిగిన మార్కాపురం ఘటనకు ముందు గతేడాది అక్టోబర్? కర్నూల్ జిల్లాలో వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురై 20 మంది మాంసపు ముద్దలుగా మిగిలారు. ఈ ఘటనలోనూ కావేరీ ట్రావెల్స్ యాజమాన్యం నిర్లక్ష్యం నిండుగా కనిపించింది. సీటింగ్‌కు పర్మిషన్ తీసుకుని అక్రమంగా స్లీపర్‌గా మార్చి సర్వీసులు నడపడంతో ప్రమాదానికి గురైన సమయంలో బయటపడేందుకు వీలు లేక ప్రాణనష్టం పెరిగింది. ఇప్పుడు మార్కాపురం ఘటనలో బస్ ఫిట్‌నెస్ సరిగా లేకపోయినా సర్వీసులు నడుపుతుండటం రాష్ట్రంలోని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాల నిర్లక్ష్యంపై మరోసారి సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు హడావుడి చేయకుండా నిత్యం తనిఖీలు చేసీ సురక్షిత ప్రయాణానికి భరోసా కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## అమరావతిలో వరుస అగ్ని ప్రమాదాలపై సిట్ ఏర్పాటు

**విశ్వంభర, ఏపీ బ్యూరో:**





ఆంధ్రప్రదేశ్ రాజధాని అయిన అమరావతిలో ఇటీవల వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ వరుస అగ్ని ప్రమాదాలపై ఏపీ ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ ఘటనల వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. గుంటూరు అడిషనల్ ఎస్పీ రవికుమార్ నేతృత్వంలో ఈ సిట్ విచారణ కొనసాగనుంది. ఈ బృందంలో ఒక డీఎస్పీ, నలుగురు సీఐలు, నలుగురు ఎస్ఐలు సభ్యులు గా ఉంటారు. రాజధాని ప్రాంతంలో పదేపదే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోవడం వెనుక ఏదైనా విద్రోహ చర్య లేదా కుట్ర కోణం ఉందా అనే దిశగా సిట్ సమగ్రంగా దర్యాప్తు చేయనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత ఈ ఘటన లపై ఇప్పటికే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాయపూడి, సీడ్ యాక్సెస్ రోడ్డు వంటి ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో కోట్ల విలువైన పైపులు, నిర్మాణ సామాగ్రి కాలి బూడిదైన నేపథ్యంలో.. ఈ కేసులను శాస్త్రీయ కోణంలో విచారించి త్వరితగతిన నివేదిక సమర్పించాలని ప్రభుత్వం సిట్ బృందాన్ని ఆదేశించింది. ఈ విచారణలో భాగంగా ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించిన తో పాటు, అనుమానితులను విచారించి రాజధాని ప్రాంతంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయనున్నట్లు తెలుస్తోంది.

## ఉగాదికి వస్తే అత్తారింట్లో మర్యాద ఇవ్వలేదని ఏడేళ్ల బామ్మర్దిని హత్య చేసిన బావ

**విశ్వంభర, అనంతపురం:**
ఉగాది పండగకు వచ్చిన తనకు అత్తామామలు మర్యాద ఇవ్వలేదని ఏడేళ్ల బామ్మర్దిని హత్య చేశాడో బావ. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా యాడికి మండలం కోనుప్పలపాడులో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. బుధవారం పాఠ శాల నుంచి వస్తుండగా బాలుడు వేమ్ చంద్రను అతడి బావ బోయ సర్వేశ్ మాయ మాటలు చెప్పి బైక్ ఎక్కించుకుని తన వెంట తీసుకువెళ్లాడు. అనంతరం వేమ్ చంద్రను హత్య చేసి కుందనకొటకొండల్లో పడేశాడు. అయితే నిన్న స్కూల్ ముగిసినా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో వేమ్ చంద్ర తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు స్కూల్ పరిసరప్రాంతంలోని సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా బాలుడిని అతడి బావ బోయ సర్వేశ్ తీసుకువెళ్లి హత్య చేసినట్లు నిర్ధరించారు. అయితే తనకు మర్యాద ఇవ్వలేదని సర్వేశ్ ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఉగాదికి తన భార్యతో కలిసి బోయ సర్వేశ్ అత్తారింటికి వచ్చాడు. అత్తారింట్లో తనకు గౌరవం ఇవ్వడం లేదని అత్త,మామలపై కక్ష పెంచుకున్న సర్వేశ్ తనబావమరిదినిహత్య చేశాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదం నింపింది.

## పెళ్లయిన మహిళతో ప్రేమ.. ఆపై ఇద్దరూ ఆత్మహత్య!

**విశ్వంభర, ఉంగుటూరు:**



వారిద్దరూ సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమయ్యారు. ఒకరినొకరు ఇష్టపడ్డారు. తర్వాత పెళ్లి చేసుకున్నారు. కానీ, అనూహ్యంగా ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ఏలూరు జిల్లా ఉంగుటూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉంగుటూరు మండలం యర్రమళ్లకు చెందిన చిన మావుళ్లయ్య (25) చేపల ప్యాకింగ్ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం శ్రీకాకుళానికి చెందిన ఇర్రి రమ (35) సామాజిక మాధ్యమాల ద్వారా అతడికి పరిచయమైంది. అది కాస్త ప్రేమగా మారింది. అప్పటికే ఆ మహిళకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఇటీవల రమను మావుళ్లయ్య వివాహం చేసుకున్నాడు. ఈవిషయం ఆమె తల్లి దండ్రులు, భర్తకు తెలియడంతో యర్రమళ్ల వచ్చి తీసుకెళ్లిపోయారు. అయితే, కుటుంబాన్ని వదిలేసి రమ మళ్లీ ఉంగుటూరు వచ్చేసింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మావుళ్లయ్య నాచుగుంట వద్ద ఏలూరు కాల్వలో దూకేశాడు. బంధువుల ఫిర్యాదు మేరకు తాడేపల్లిగూడెం అగ్నిమాపక సిబ్బంది గాలించారు. బుధవారం రాత్రి ఉంగుటూరు సమీపంలో అతడి మృతదేహం లభ్యమైంది. రెండు రోజుల క్రితం మావుళ్లయ్య, రమ కలిసి తిరిగారని స్థానికులు చెప్పడంతో ఆమె కూడా ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని చేబ్రోలు పోలీసులు అనుమానించి.. మంగళగిరి నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో చేబ్రోలు పోలీస్‌స్టేషన్ సమీపంలోని వంతెన వద్ద ఆమె మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆగ్రహం

**విశ్వంభర, ఏపీ బ్యూరో:**



తీవ్ర కలకలం రేపిన రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది 17 మందిని పొట్టన పెట్టుకున్న ఈ ఘటనపై తాజాగా ఎన్ హెచ్‌ఆర్సీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కల్తీ పాల ఘటనను సుమోటోగా స్వీకరించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ ఈ ఘటనపై నివేదిక ఇవ్వాలని ఏపీ సీఎస్, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. 2 వారాల్లోగా పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. కాగా ఈ ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన రాజమండ్రిలో కల్తీ పాలు ఘటన చోటు చేసుకుంది. పాలలో ఇథిలీన్ గ్లైకాల్ అనే అత్యంత విషపూరిత రసాయనం కలిసినట్లు అధికారులు నిర్ధారించారు. పాలను నిల్వ చేసే ఫ్రిజర్‌లో ఈ ఇథిలీన్ గ్లైకాల్ లీక్ అయ్యి.. పాల క్యాన్లలో కలవడం వల్లే ఈ ఘోరం జరిగిందని పోలీసుల దర్యాప్తులో బహిర్గతమైంది. ఈ పాలు తాగిన వారిలో వృద్ధులు, చిన్నారులు అధికంగా ఉన్నారు.

## బస్సు కండీషన్ బాగానే ఉంది: క్లీనర్ మహేంద్ర

**విశ్వంభర, మార్కాపురం:**



మార్కాపురం జిల్లా బస్సు ప్రమాద ఘటన నుంచి మొదటగా ప్రాణాలతో బయటపడింది తానేనని క్లీనర్ మహేంద్ర తెలిపారు. "ప్రమాద సమయంలో నిద్రపోతున్నా. లేచి చూసేసరికి బస్సు మంటల్లో చిక్కుకుపోయింది. మంటల్ని నియంత్రించే సిలిండర్లు బస్సులో ఉన్నాయి. కానీ, పొగ దట్టంగా వ్యాపించడంతో అవి సరిగ్గా కనిపించలేదు. అద్దాలు పగలగొట్టి చాలా మంది ప్రాణాలతో బయటపడ్డారు. బస్సు కండిషన్ బాగానే ఉంది" అని మహేంద్ర తెలిపారు.

## ఒంటిమిట్ట కోదండ రామాలయంలో యాగశాల సిద్ధం



**విశ్వంభర, ఒంటిమిట్ట :** వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం అంకురార్పణ చేయనున్నారు. పూజా కైంకర్యాలు, హోమాల నిర్వహణకు యాగశాలను ముస్తాబు చేస్తున్నారు. రుత్వికులు, అర్చకులు కలశాలను సిద్ధం చేస్తున్నారు. మామిడి తోరణాలు, అరటి ఆకులను కడుతున్నారు. ముగ్గులు వేస్తున్నారు. కొబ్బరి కాయలకు పవిత్ర పసుపు లేపనం చేస్తున్నారు. సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలు, పుష్ప మాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరిస్తున్నారు.

## మందపాడులో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించినద ఏపీ ఉపసభాపతి

**విశ్వంభర, ఆకివీడు:**



మండలంలోని మందపాడు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఉండి ఎమ్మెల్యే, ఏపీ ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు గురువారం ప్రారంభించారు. పీడబ్ల్యూ ఎస్ స్కీం కింద రూ.9.5 లక్షలతో నిర్మించిన 0.5 ఎంఎల్‌డీ మైక్రో ఫిల్టర్ ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో ఉప్పుటేరు వద్ద నిర్మించిన రేవును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కనుమూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## జన్మనిచ్చిన అమ్మే.. పునర్జన్మనూ ఇచ్చింది..! కొడుకు ప్రాణాలు కాపాడి మంటల్లో కాలిపోయిన తల్లి

**విశ్వంభర, మార్కాపురం:**



ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ఓ తల్లి తన ప్రాణాలను పణంగా పెట్టి కొడుకును కాపాడిన ఘటన ప్రతిఒక్కరిని కన్నీళ్లు పెట్టిస్తోంది. మంటలు వ్యాపిస్తున్న క్రమంలో తన కొడుకును బస్సు బయటకు తోసేసి సురక్షితంగా కాపాడిన ఆమె, తాను మాత్రం బస్సులోనే చిక్కుకుని సజీవదహనమైన ఘటన అందరి హృదయాలను ద్రవింపజేస్తోంది. వివరాల్లోకి వెళితే.. కనిగిరి మండలం మందాడివారిపల్లికి చెందిన ఉప్పు రమాదేవి (45) తన కుమారుడు మనోహర్‌తో కలిసి బస్సులో స్వగ్రామానికి ప్రయాణిస్తున్నారు. మార్కాపురం సమీపంలో బస్సు ప్రమాదానికి గురై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు బస్సును చుట్టుముట్టాయి. అయితే, అందరికంటే ముందే బస్సులో మంటలను గమనించిన రమాదేవి, ప్రమాదం తీవ్రతను ముందే ఊహించి తన కొడుకు మనోహర్‌ను వెంటనే బస్సు కిటికీ నుంచి బలవంతంగా బయటకు తోసేసింది. దీంతో మనోహర్ సురక్షితంగా బయటపడ్డాడు. కానీ, అప్పటికే మంటలు తీవ్రమవ్వడం, పొగ అలుముకోవడంతో రమాదేవి బయటకు రాలేకపోయింది. బయటపడ్డ కుమారుడు తన తల్లిని కాపాడాలని ఆర్తనాదాలు చేస్తున్నప్పటికీ, మంటల ఉధృతికి ఎవరూ లోపలికి వెళ్లలేకపోయారు. కన్న కొడుకు కళ్లెదుటే రమాదేవి బస్సులో చిక్కుకుని మంటల్లో కాలి బూడిదైంది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు, ప్రయాణికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

## శ్రీరామనవమి వేడుకలో పాల్గొనేందుకు వెళ్తూ.. అనంతలోకాలకు!

**విశ్వంభర, మార్కాపురం:** మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో 14 మంది ప్రయాణికులు సజీవ దహనం కాగా.. మరో 28 మందికి గాయాలైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో.. ఒక్కొక్కరిది ఒక్కో విషాద గాథ. కుటుంబపోషణ కోసం స్వగ్రామాన్ని వదిలి తెలంగాణలోని జగిత్యాలకు వచ్చిన వ్యక్తి.. శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొనేందుకు సొంతూరికి బయలుదేరాడు. అనుకోకుండా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.వివరాల్లోకి వెళ్తే... ప్రకాశం జిల్లా ఉదయగిరి సమీపంలోని దాసరపల్లికి చెందిన ముత్తంగి వెంకటేశ్వర్లు గత మూడు సంవత్సరాలుగా పొదలకూరు మండలం తోకంచి (వెంకటేశ్వర్ నగర్)లో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబంతో ఉన్నాడు. ఈ ఏడాది సంక్రాంతి తర్వాత తెలంగాణలోని జగిత్యాల జిల్లాకు బేల్దారి పనుల కోసం వెళ్లాడు. శ్రీరామనవమిని పురస్కరించుకొని కుటుంబసమేతంగా కల్యాణంలో పాల్గొనేందుకు జగిత్యాల నుంచి ప్రకాశం జిల్లాలోని స్వగ్రామానికి బయలుదేరాడు. వేరే బస్సులో జిల్లాలోని పామూరుకు చేరుకున్న వెంకటేశ్వర్లు.. అక్కడి నుంచి పొదలకూరు చేరుకోవాలని కనిగిరి వైపు వస్తున్న ట్రావెల్స్ బస్సును ఎక్కాడు. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద జరిగిన ప్రమాదంలో వెంకటేశ్వర్లు ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబంతో శ్రీరామనవమిని ఘనంగా నిర్వహించుకోవాలనుకున్న వెంకటేశ్వర్లు.. స్వగ్రామానికి చేరుకోకుండానే అనుకోని విషాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఇంటి పెద్దను కోల్పోయిన ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**విశ్వంభర, నాగారం:** ముఖ్యమంత్రి సహాయనిధి నీరుపేదలకు వరం లాంటిదని నాగారం బంగ్లా సర్పంచ్ భయ్యం సుజాత వెంకన్న అన్నారు. గురువారం తుంగతుర్తి నియోజకవర్గం నాగారం మండలం నాగారం బంగ్లా గ్రామానికి చెందిన ఓర్సు పెద్ద వెంకన్నకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ. 60,000 చెక్కును పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు జాజుల వీరయ్య, భయ్యం వెంకన్న, ఉపసర్పంచ్ ఛిరిక నరేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు కొనిరెడ్డి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలి



**విశ్వంభర, నాగారం:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అభయహస్తం పేరుతో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో చట్ట బద్ధత కల్పించాలని తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో బీఆర్ ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు మహిళలకు 2500 ,వికలాంగులకు 6000 వృద్ధులకు 4000, రైతులకు 15000వేలు, నిరుద్యోగభృతి, విద్యార్థులకు విద్యాభరోస కార్డు, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసపూరిత మాటలు చెప్పి అధికారానికి వచ్చి రెండున్నరేండ్లు అవుతున్న ఒక్కటి నెరవేర్చ లేదని అన్నారు. అధికారం లోకి రాగానే చట్ట బద్ధత కల్పిస్తామని చెప్పిన మాటలు మరిచిపోయిన ప్రభుత్వానికి ప్రతిపక్ష హోదాలో అసెంబ్లీ లో ప్రవేశ పెట్టబోయే ప్రైవేట్ మెంబర్ బిల్లు కు మద్దతివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, మండల నాయకులు దొంగరి శ్రీనివాస్, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, నాయకులు. మట్టిపెల్లి వెంకట్. మన్నూరు పోతరాజు. ఇసాకర్. సతీష్. బెడద రాములు. మాజీ సర్పంచ్ సోమశేఖర్. సైదులు. సరిత. బింగివెంకన్న మహేష్. తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్రామ శాఖ నూతన కమిటీ

**విశ్వంభర, నాగారం**: శాలిగౌరారం మండలంలోని రామగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఆ పార్టీ సీనియర్ నాయకుడు చామల వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారు. గ్రామ శాఖ ఉపాధ్యక్షులుగా లోడంగి సైదులు, దీటీ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల యాదయ్య, కార్యదర్శిగా బొడ్డు రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా బట్టు మల్లేష్, కోశాధికారిగా నంద్యాల నర్సింహ లను ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మొగుళ్ళ శ్రీను, లోడంగి మహేష్, ఆకుల శ్రీను, కృష్ణ మూర్తి, అవిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల ఎన్ క్లేవ్ లో తీరిన రహదారి కష్టాలు




**విశ్వంభర, మేడ్చల్:** కీసర సర్కిల్ దమ్మాయి గూడ డివిజన్11వ వార్డు పరిధిలోని తిరుమల ఎన్క్లేవ్ ఫేజ్1 కాలనీలో నెలకొన్న రహదారి సమస్యలకు పరిష్కారం లభించింది. కాలనీలో దెబ్బతిన్న రోడ్ల వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అసోసియేషన్ సభ్యులు కాంగ్రెస్ ప్రెసిడెంట్ ముప్ప రామారావు దృష్టికి తీసుకెళ్లారు. స్థానికుల విన్నపానికి సానుకూలంగా స్పందించిన రామారావు వెంటనే రోడ్ల మరమ్మతు పనులను చేపట్టారు. ఆయన స్వయంగా పనులను పర్యవేక్షించగా, కాలనీలోని గుంతలను పూడ్చి ప్యాచ్వర్క్ పనులను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. తమ విన్నపాన్ని మన్నించి, త్వరితగతిన స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించినందుకు ముప్ప రామారావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ కవితా పోటీల్లో నీరజ్ ప్రతిభ



**విశ్వంభర, నెల్లికుదురు :** మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి సామల నీరజ్ జాతీయ కవితాపోటీల్లో సత్తా చాటాడు. వసుంధర విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో కర్క ముత్తారెడ్డి జాతీయస్థాయి పాఠశాల విద్యార్థుల కవితా పోటీలలో నీరజ్ అసాధారణ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచాడు.సంబంధిత సంస్థ అధ్యక్షులు మధుకర్ వైద్యుల, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు నాళేశ్వరం శంకరం చేతుల మీదుగా ప్రథమ బహుమతిని నీరజ్ కు అందజేశారు. దీంతో నీరజ్ ను ఎంఈఓ, ఆలేరు హై స్కూల్ హెచ్ఎం ఆంగోత్ రాందాస్ తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించింది.

## సీతారాములకు బంగారు బొట్లు



**విశ్వంభర, ఉప్పుగూడ:** శ్రీ సీతారామ చంద్ర స్వామి తిరు కళ్యాణ మహోత్సవ సందర్భంగా విఘ్నేశ్వర సాయి ధామం, మల్లికార్జున్ నగర్ లలితాబాగ్ ఉప్పుగూడలో సిల్వర్ జూబ్లీని ముగించుకొని రామునికి, సీతమ్మవారికి, లక్ష్మణునికి, హనుమంతునికి చంద్రశేఖర్ చారి కానుకగా బంగారు బొట్లు చేయించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మిద్దెల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ మునిగంటి సుశీల్ కుమార్ చారి, కోశాధికారి గుండు శ్రీకాంత్, బోనకుర్తి మోహన్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

### రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే అరైవ్ - అలైవ్ : ఎస్పీ నరసింహ




**విశ్వంభర, సూర్యాపేట:** ఉజ్వలమైన, ఉన్నతమైన లక్షాలను ఎంచుకుని నిరంతరం కృషి చేస్తే మంచి విజయాలు వస్తాయి, పాఠశాలలు దేవాలయాలు, తరగతి గదులు ప్రయోగశాలలు వీటిని సద్వినియోగం చేసుకోవాలి అని ఎస్పి నరసింహ అన్నారు. చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధి దురాజుపల్లి గ్రామం వద్ద ఉన్న ఎం.ఎస్.ఆర్ సెంట్రల్ స్కూల్ నందు చివ్వేంల పోలీసులు, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం లో జిల్లా ఎస్పి నరసింహ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి, మంచి లక్ష్యాలు ఎంచుకోవడం, ప్రణాళికతో చదువుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండడం, రోడ్డు భద్రత, సైబర్ మోసాలు లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. మంచి ప్రణాళిక పెట్టుకుని చదవాలి అన్నారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్ వినియోగం ప్రధాన సమస్యగా ఉన్నాయి వీటి నిర్మూలనకు పోలీసు శాఖ కృషి చేస్తుంది యువత, పౌరులు భాగస్వామ్యం కావాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడం, రోడ్డు ప్రమాదంలో ఏ ఒక్కరు మరణించకుండా సురక్షితంగా గమ్యం చేరడం, రోడ్డు భద్రతా నియమాలు తెలియజేయడం లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత మహాఉద్యమం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది, మానవ తప్పిదాల వల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదం లో ప్రాణం కోల్పోకూడదు అనేది పోలీస్ శాఖ లక్ష్యమని తెలిపారు. పిల్లలు వాహనాలు నడపడం ప్రమాదం, నేరము అన్నారు. రోడ్డు భద్రత గురించి తల్లిదండ్రులకు పిల్లలకు వివరించి సేఫ్టీ డ్రైవింగ్, డిఫెన్సివ్ డ్రైవింగ్ పట్ల చైతన్య వంతం చేయాలని అన్నారు. ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించకపోతే రోడ్డు ప్రమాదాలకు గురౌతారు, రోడ్డు పై వెళ్ళేటప్పుడు డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయాలి, డిఫెన్సివ్ వాకింగ్ చేయాలి రోడ్డుపై చుట్టూ ఉన్న పరిసరాలు, ప్రమాదాలు, అడ్డంకులు గమనిస్తూ ముందుకు వెళ్లాలి అన్నారు. రోడ్డు దాటే క్రమంలో జాగ్రత్తగా ఉండాలి అన్నారు. అతివేగంగా వాహనాలు నడపవద్దు అని కోరారు. హెల్మెట్ ధరించాలి, సీటు బెల్టు పెట్టుకోవాలి అని అన్నారు. దేశ రక్షంలో చనిపోతే వారికంటే రోడ్డు ప్రమాదాలలో చనిపోయే వారి సంఖ్య ఎక్కువ అని గుర్తు చేశారు. డ్రగ్స్ బారిన పడి యువత అనారోగ్యం పాలు అవుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు, డ్రగ్స్ లాంటి వాటికి అలవాటు పడవద్దు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. సమాజంలో డ్రగ్స్ అనేక రకాల రూపంలో దొరుకుతున్నాయి, దీనిని నిర్మూలించాల్సిన భద్రత యువతపై ఉన్నది దీని సమాచారం పోలీసు వారికి తెలియజేయాలి అని కోరారు. సాంకేతికత అభివృద్ధి చెందిన కొద్దీ సైబర్ మోసగాళ్లు కొత్త తరహాలో ప్రజలను మోసగించి ఆర్థిక నష్టాలు కలిగిస్తున్నారు, అపరిచితులు ఏదైనా బహుమతులు ఉన్నాయని ఆశ చూపితే అత్యాశకు పోవద్దు వ్యక్తిగత సమాచారం అపరిచితులకు ఇవ్వవద్దని సూచించారు. ఇంటర్నెట్ నందు నకిలీ వెబ్సైట్ దర్శనమిస్తున్నాయని వాటిల్లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకున్నట్లయితే అవి సైబర్ మోసగాళ్ల చేతికి వెళ్లి ఆర్థిక నష్టాలు కలుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు ఇంటర్నెట్ సద్వినియోగం చేసుకోవడంలో సామాజిక మాధ్యమాలు ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ ట్విట్టర్ వాట్సప్ వంటివి వినియోగించేటప్పుడు నకిలీ వాటిని గుర్తించాలని వీటికి వచ్చే సందేశాలను అనుసరించి పెట్టుబడులు పెట్టవద్దని ఉద్యోగాలు ఇప్పిస్తామంటే డబ్బులు కట్టవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో షీ టీం, పోలీస్ కళా బృందం వారు విద్యార్థుల రక్షణ, సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, షీటీం ఎస్సై నీలిమ, ఎమ్మెస్సార్ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.


## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

**○ మల్లారెడ్డిపల్లి గ్రామ సభ**




**విశ్వంభర, చింతపల్లి:** మన ఊరు మన అభివృద్ధి మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా చింతపల్లి మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ నల్ల సుమిత రఘుమారెడ్డి అధ్యక్షతన గురువారం గ్రామ సభ జరిగింది. ఈ గ్రామసభలో తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం, గ్రామ పంచాయితీ ఆదాయ వ్యయాలపై చర్చించారు. సర్పంచ్ సుమిత రఘుమారెడ్డి మాట్లాడుతూ, మల్లారెడ్డిపల్లి గ్రామానికి 50 లక్షల రూపాయలతో ఇంటర్నల్ సిసి రోడ్లు, 30 లక్షల రూపాయలతో రైతులు ధాన్యం నిల్వ చేసుకునే వ్యవసాయ గోదాం మంజూరు కావడం జరిగిందన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. గ్రామానికి అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తనన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కారించేందుకు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని వారు అన్నారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా గ్రామపంచాయతీ సిబ్బంది చూడాలని వారు సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఎన్.ఎస్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పాడ్స్, పెన్నులు, పెన్సిల్స్, కంబాక్స్ లు అందించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తుందని అందులో భాగంగా వ్యవసాయ పనిముట్లు సబ్సిడీలో మూడు రోటోవేటర్లు రావడంతో రైతులకు ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్ల రఘుమారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, వార్డ్ మెంబర్లు, అధికారులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎల్ రాజాం ని కలిసిన వట్టే జానయ్య యాదవ్



**విశ్వంభర, సూర్యాపేట:** హైదరాబాద్ లోని విజయక్రాంతి దినపత్రిక కార్యాలయంలో ప్రముఖ మీడియా ప్రతినిధి సీఎల్ రాజాం ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ ప్రతినిధులు మీడియా పాత్రను ప్రశంసిస్తూ, ప్రజాస్వామ్యంలో పత్రికల ప్రాముఖ్యత ఎంతో గొప్పదని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక, రాజకీయ పరిణామాలను ప్రజలకు చేరవేయడంలో విజయక్రాంతి దినపత్రిక చేస్తున్న సేవలను కొనియాడారు. సీఎల్ రాజాం తో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యలు, అలాగే పార్టీ భావజాలం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉపాధ్యక్షులు ఓదెలు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్షులు అశోక్ ముదిరాజ్, మధన్ మోహన చారి, జిల్లా అధ్యక్షులు విజయ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

### సాదాబైనమా, భూభారతి

## దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**○ కలెక్టర్ తేజస్ నంద్ లాల్**





**విశ్వంభర, సూర్యాపేట:** జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాదా బైనామ, భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని విసీ హాల్ నందు జిల్లాలోని ఆర్డీవోలు, తహసిల్దార్ లతో పెండింగ్ సాదాభైనమా, భూభారతి, భూ సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకునేలా జీవో 76ను జారీ చేసినట్లు తెలిపినారు.సాదా బైనామా ద్వారా భూములు అమ్ముకునే సమయంలో అమ్మే వ్యక్తి రికార్డు నందు నమోదు కలిగి ఉండాలని, అదే విదంగా పట్టా భూములను మాత్రమే ప్రాసెస్ చేయాలని సూచించారు. వీటితో పాటు భూమి మీద పొజిషన్ తో పాటు, 5ఎకరాల లోపు భూములు కలిగివున్న వారికీ మాత్రమే పరిష్కరించాలన్నారు. నోటీస్ జారీ చేసి 30 రోజులు పూర్తి అయిన వాటిని పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి పంచనామా చేయాలని తెలిపారు. చాలన్ కట్టే ముందు ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు సరి చేసుకోవాలని ఆదేశించారు. సాదా బైనమా దరఖాస్తులకు పరిష్కారం తొందరగా పూర్తి చేసి అర్హులైన వారికి 13 (బి) పట్టాలను జారీ చేయాలని తెలిపారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కారం చూపాలని, అలాగే కోర్టు కేసులు, హైకోర్టులో నమోదైన కేసులకు విధిగా జవాబు ఇవ్వాలన్నారు. అదే విదంగా ప్లాట్స్ బుకింగ్ క్యాన్సిల్ చేసుకున్న వారికి రీ పేమెంట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ కింద ఎలక్షన్ మ్యాపింగ్ ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫారం 6,7,8 పెండింగ్ లేకుండా చూడాలని, అదే విదంగా మరణించిన ఓటర్లును జాబితా నుండి తొలగించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి, సూపరిటెంట్లు సాయిగౌడ్, శ్రీలత, సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం





**విశ్వంభర, కౌకుంట్ల:** ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజల దాహం తీర్చేందుకు చల్లని తాగునీరు అందించే ఉద్దేశంతో గ్రామపంచాయతీ తరపున సర్పంచ్ ఉల్లి నరేష్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచ్ ఉల్లి నరేష్ మాట్లాడుతూ, ఈ చలివేంద్రం ద్వారా గ్రామ ప్రజలు ప్రయాణికులు చల్లని నీరు తాగుతూ ఉపశమనం పొందాలని బస్టాండుకు ప్రాంగణంలో ఉన్నందుకు ప్రతి ఒక్కరూ వేసవి దాహార్తికి చల్లని నీటికి ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, గ్రామపంచాయతీ కార్యదర్శి బుచ్చన్న, వార్డు మెంబర్లు కోడి సురేందర్ కావలి లక్ష్మణ్ ఆంజనేయులు రవీందర్ రెడ్డి మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండన్న, టౌన్ అధ్యక్షులు రాకేష్ సాగర్ పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని బార్ సోసియేషన్ ఎన్నికలలో మూడోసారి అధ్యక్షులుగా ఎండి.మజీద్, ప్రధాన కార్యదర్శిగా యాదాసు యాదయ్య పోటీ చేయగా, విస్తృతంగా ప్రచారం నిర్వహించిన అనంతరం ఎన్నికలు నిర్వహించగా, మెజారిటీతో అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నిక కావడం జరిగింది. రామన్నపేట బార్ అసోసియేషన్ ఎన్నికలలో మూడవ సారి అధ్యక్షులుగా ఎన్నికైన ఎండి మజీద్, కార్యదర్శిగా యాదసు యాదయ్య, అలాగే ఉపాధ్యక్షులుగా సంగిశెట్టి బాలరాజు, సహాయ కార్యదర్శిగా దినేష్, కోశాధికారి కూనూరు శ్రీనివాస్, స్పోర్ట్స్ అండ్ కార్యదర్శిగా శ్రవణ్ కుమార్, లేడీ రిప్రెసెంటివ్ గా రోసమ్మ థామస్, కార్యవర్గ సభ్యులుగా పాల్వంచ జగతయ్య, సోమ సతీష్ రెడ్డి, సయ్యద్ అజీజుద్దీన్ లు ఎన్నికైనట్టుగా ఎన్నికల అధికారి యేళ్ల శ్రీశైలం ప్రకటించారు.

## కౌకుంట్ల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావన



**విశ్వంభర, కౌకుంట్ల :** అసెంబ్లీలో సమావేశాలలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలోని నూతనంగా ఏర్పడిన కౌకుంట్ల మండలంలోఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన సాంకేతిక సమస్యలను, కౌకుంట్ల మండల కాంప్లెక్స్ సమస్యను రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి మరియు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కౌకుంట్ల మండలంలోని కాంగ్రెస్ నాయకులు, ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలి

### సూర్యాపేట పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటయ్య

**విశ్వంభర, సూర్యాపేట:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా గురువారం సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని న్యూ బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ, ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చడం టాక్సీ డ్రైవర్ల బాధ్యత అని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో నిదానంగా నడపాలని, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించవద్దు అని తెలిపినారు. వాహనాలలో ప్రయాణికులు ఏవైనా వస్తువులు మర్చిపోతే బాధ్యతగా వారికి అందజేయాలని లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని. ప్రయాణికులతో మర్యాదగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత పట్ల ఎదుటివారికి అవగాహన కల్పించడంలో బాధ్యతగా ఉండాలని కోరారు. ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మాట్లాడుతూ జాగ్రత్తగా వాహనాలు నడుపుతూ సురక్షితంగా గమనించాలి సూచించారు. నియమ నిబంధనలు పాటించినట్లయితే కేసులు నమోదయితాయని హెచ్చరించారు.




## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సర్పంచ్

**విశ్వంభర, రామన్నపేట:** మన ఊరుమన సర్పంచ్మన పిల్లల భవిష్యత్తులో భాగంగా యాదాద్రి జిల్లా, రామన్నపేట మండలం, నీర్నెముల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి పరిశీలించారు. కేవలం పరిశీలించడమే కాకుండా, ఉదయం పిల్లలతో కలిసి రాగిజావ తాగి, మధ్యాహ్నం వారితోనే కూర్చుని భోజనం చేశారు. ప్రజాప్రతినిధులు ఇలా నిరంతరం పర్యవేక్షించడం వల్ల పాఠశాలలో విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు మెరుగుపడతాయని గ్రామస్తులు ఆశిస్తున్నారు.



# గ్రామగ్రామాన ప్రచార కార్యక్రమాలు

## రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన




**విశ్వంభర, మహబూబాబాద్:** గురువారం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న మరిపెడ, చిన్నగూడూరు, మహబూబాబాద్ మండలాలలోని సాగులో ఉన్న ఆయిల్ పామ్, మామిడి, సపోటా, కూరగాయలు మరియు ఉద్యాన పంటలను సందర్శించి రైతులకు వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పలు రకాల సాంకేతిక, యాజమాన్య పద్ధతులు తెలియజేసారి. వేసవిలో పచ్చి రొట్ట ఎరువులు వేసుకోవాలన్నారు. వరి, పత్తి, మిరప, మొక్కజొన్న వంటి పంటలకి బదులుగా మార్కెట్ డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్, అన్ని రకాల కూరగాయలు, పండ్లు, మునగ, ఉల్లి, వెల్లుల్లి, పూలు, మల్బరీ మొదలైన పంటలు సాగు చేయాలన్నారు. మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని, నిత్యం రోగనిరోధక శక్తికి, ఆరోగ్యంగా ఉండటానికి పోషకాలు అందించే పండ్ల తోటలు అయిన జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, అవకాడో, ఫ్యాషన్ ఫ్రూట్, కూరగాయలు, ఆకు కూరలు, మునగ, వెదురు మొదలైనవి సాగు చేయాలని తద్వారా ఎకరానికి లక్ష రూపాయలు నికర ఆదాయం పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రో ట్రే లో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలన్నారు. బోర్ల క్రింద ఆయిల్ పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, పూలు, మల్బరీ, పలు రకాల ఉద్యాన పంటలు సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు డా.భీమసాగర్, టి. వెంకన్న, ఉద్యాన, ఆయిల్ ఫెడ్ సిబ్బంది టి. విజయ పాల్ రెడ్డి, డి. రాజ కిశోర్, వై.అనిల్, యం.ఐ. కంపనీ జిల్లా రెప్రెజెంటేటివ్ బి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

**విశ్వంభర, చంద్రాయణగుట్ట:** చంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు డివిజన్లో నివాసం ఉంటూ అనారోగ్యానికి గురై ఇబ్బంది పడుతున్న ఐదు కుటుంబాలకు 4,00,000 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు చంద్రాయన గుట్ట కంటెస్టెడ్ కాంగ్రెస్ ఇంచార్జ్ బోయ నగేష్ అందజేశారు. చెక్కులు పొందిన కుటుంబ సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి పొన్నం ప్రభాకర్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా దినోత్సవ వేడుకలు

**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండ లోని జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను అంబేద్కర్ భవన్లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థాన్ చైర్మన్ ప్రకాష్‌గౌడ్, వైస్ చైర్మన్ శ్రీనివాస్ రఘు లతో పాటు ఇతర బోర్డు సభ్యులు పాల్గొని వృత్తి విద్యా కోర్సుల్లో ట్రైనింగ్ పొందిన 800 మంది మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జన శిక్షణ సంస్థాన్ ట్రైనీలు నేర్చుకున్న నైపుణ్యాలను స్టాల్స్ రూపంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతినిధి సతీష్ రెడ్డి స్టాల్స్ ను సందర్శించి ట్రైనీల ప్రతిభను అభినందించారు.హనుమకొండ జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నరసింహమూర్తి మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధితో వ్యాపారవేత్తలుగా ఎదగడానికి గల ప్రభుత్వ ప్రయోజనాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం జన శిక్షణ సంస్థాన్ వారి కృషి అభినందనీయమని చైర్మన్ ప్రకాష్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.అనంతరం జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఖాజా మసియుద్దీన్ సంస్థ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది.ఈ వేడుకలో మహిళలకు సన్మానాలతో ముగిసింది. ఈ కార్యక్రమంలో జాతీయ యూత్ అవార్డి ఏ మధు,మై భారత్ డైరెక్టర్ అన్వేష్, జాతీయ యూత్ ఐకాన్ శ్రీజ,బోర్డు సభ్యులు కె.రాణి, సఖి కేంద్రం సభ్యులు హైమవతి,జన్ శిక్షణ సంస్థాన్ సిబ్బంది,ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ కు పరామర్శ



విశ్వంభర, సూర్యాపేట : ఖమ్మంలోని ప్రైవేట్ హాస్పిటల్ లో ఇటీవల అనారోగ్యతో గుండెకు సంబంధించిన చికిత్స పొంది, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ జర్నలిస్ట్ ఎడ్వర్డ్ ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పాల్వాయి జానయ్య, సీనియర్ జర్నలిస్టులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎడ్వర్డ్ తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు . పరామర్శించిన వారిలో సీనియర్ జర్నలిస్టులు చంద్రశేఖర్, శ్యామ్ సుందర్ రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్, అశోక్, గుడపూరి ప్రభాకర్, కొంగల సతీష్, అనిల్ తదితరులు ఉన్నారు.

## ఆశావర్కర్ల సమస్యలపై ఉద్యమం

**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** ఆశావర్కర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లి బీఆర్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 28న ఆశావర్కర్లతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్డు మీదుగా ఇందిరా పార్క్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపడతామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఆశావర్కర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించకపోవడం బాధాకరమని అన్నారు. ఆశావర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు రావుల సంతోష మాట్లాడుతూ జీతాలు ఆలస్యంగా చెల్లించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించే విధానం అమలు చేయాలని కోరారు. వేతనాల పెంపుతో పాటు భద్రత, బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, యాదమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

## నేడే సీతారాముల శోభాయాత్ర



**విశ్వంభర, అంబర్‌పేట :** హిందూ ఐక్యతను బలోపేతం చేసి సంస్కృతి సాంప్రదాయాలను ప్రజలకు చాటడమే లక్ష్యముగా సీతారాముల శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ కన్వీనర్ డా. ఎన్. గౌతమ్ రావు తెలిపారు. అంబర్‌పేట్‌లో నిర్వహిస్తున్న శ్రీ సీతారాముల మహా శోభాయాత్ర శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని, అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమయ్యే ఈ శోభాయాత్రలో యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. భక్తి గీతాలు, సాంప్రదాయ నృత్యాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. శోభాయాత్ర అంబర్‌పేట ఎంసిహెచ్ గ్రౌండ్ నుంచి శ్రీరామ్ థియేటర్, 6 నెంబర్ చౌరస్తా, తిలక్ నగర్, ఫీవర్ హాస్పిటల్, బర్కత్‌పురా ఎక్స్ రోడ్, టూరిస్ట్ హోటల్ మార్గంగా కాచిగూడలోని వీర్ సావర్కర్ విగ్రహం వరకు కొనసాగనుంది.

## యోగా శిక్షణ తరగతుల బ్రోచర్ ఆవిష్కరణ




**విశ్వంభర, రామన్నపేట:** శ్రీశిరిడి సాయి అష్టాంగ తొమ్మిది రోజుల యోగా శిక్షణ తరగతులు యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో ఉన్న అమృతవనం అగ్రిఫామ్ రిసార్ట్ లో మార్చి 29వ తారీఖు నుంచి ఏప్రిల్ ఆరో తారీఖు వరకు నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం 5:30 నుండి 7:00 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 6:30 నుండి 8:00 గంటల వరకు శిక్షణ నిర్వహించనున్నారు. ఈ శిక్షణ తరగతుల బ్రోచర్ ను రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, సబ్‌ఇన్స్పెక్టర్ డి.నాగరాజు ఆవిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు యోగేశ్వర్, అమృతం అగ్రిఫామ్ రిసార్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కడారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ తొమ్మిది రోజుల శిక్షణలో వ్యాయామాలు, ప్రాణాయామాలు, సూర్య నమస్కారాలు, ధ్యానం, ఆసనాలు నేర్పించడంతో పాటుగా సంపూర్ణ ఆరోగ్యానికి పచ్చి కూరగాయలతో అమృత ఆహారం అందించబడుతుందని గురూజీ తెలియజేశారు. ఈ శిక్షణలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సంపూర్ణ ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకి యోగ సాధన చాలా అవసరమని, ప్రతి ఒక్కరి జీవితంలో యోగాను ఒక భాగంగా చేర్చుకోవాలన్నారు. సబ్‌ఇన్స్పెక్టర్ డి.నాగరాజు మాట్లాడుతూ, పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారని, అటువంటి ఆరోగ్యాన్ని యోగసాధనతో కాపాడుకోవడం చాలా ఉత్తమమైన మార్గమని తెలియజేశారు. ఈ శిక్షణలో పాల్గొనదలచిన వారు 9603256572 మొబైల్ నంబరును సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

## మాజీ ఎంపీ ధర్మ బిక్షం 15వ వర్ధంతి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో గురువారం గీతపనివారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎంపీ ధర్మ బిక్షం 15వ వర్ధంతిని గీతపనివారల సంఘం జిల్లా సహా కార్యదర్శి ఎర్ర రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2011 మార్చి 26న గీత పనివారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షం భౌతికంగా దూరమై 15 సంవత్సరాలు అయ్యిందని, భౌతికంగా వారు దూరమైనా బడుగు బలహీన వర్గాల మనసుల్లో, గీత పనివారల గుండెల్లో, జీవితాల్లో కలకాలం ఉండిపోతారని, ఆయన చేసిన త్యాగం అలాంటిదని అన్నారు. గీత పనివారలకు 50 ఏండ్లకు పింఛన్లు వస్తున్నాయి అన్నా, సొసైటీకి తాటి చెట్ల పెంపకానికి ఐదు ఎకరాల భూమి ఉండాలని 560 జీవో సాధించింది ఆయనే అని, వృత్తిలో ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబానికి ఆసరా కోసం ఎక్స్ గ్రేషియో ఉండాలని డిమాండ్ తో గౌడన్నలను తాటి చెట్లు ఎక్కే గీతపని వారలందరిని ఏకం చేసి ప్రభుత్వాలతో కొట్లాడి సాధించారని అన్నారు. గౌడ జాతికి ఆణిముత్యం లాంటి మనిషి బొమ్మగాని ధర్మ బిక్షం అని, వారి కాంస్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై నెలకొల్పాలని, ఆయన జీవితాన్ని పాఠ్యాంశాలలో చేర్చి నేటి యువతకు అర్థమయ్యేలా చేయాలని, సూర్యాపేట జిల్లాకు బొమ్మగాని ధర్మబిక్షం పేరును ఖరారు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నివాళులర్పించిన వారిలో గీత పనివారల సంఘం మండల అధ్యక్షులు గంగాపురం వెంకటయ్య, సొసైటీ అధ్యక్షులు ఎర్ర వెంకటేశం, సంఘం సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, బాలగోని నరసింహ, గంగాపురం యాదయ్య, వీరమల్ల వెంకటయ్య, ఎర్ర సత్తయ్య, వీరమల్ల ముత్తయ్య, చెరుకు శివరాజు, పెండెం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ లో ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలు

### జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి డా. ఓలేటి జ్యోతి



**విశ్వంభర, మహబూబాబాద్ :** 202627 సంవత్సరానికి గాను 4వ తరగతి బాల, బాలికలకు స్పోర్ట్స్ స్కూల్ లో ప్రవేశం కొరకు జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి డా. ఓలేటి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని 18 మండలాల స్థాయిలో సెలెక్ట్ అయిన బాల, బాలికలకు మార్చి 31వ తేదీన ఉదయం 8.00 గంటల కి ఎన్టీఆర్ స్టేడియం నందు జిల్లాఎంపిక పోటీలు జరుగుతాయని అన్నారు. బాల బాలికలకు ఎత్తు, బరువు, 800 మీటర్ల పరుగు, 6 x 10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ వంటి తొమ్మిది రకాల పోటీలు నిర్వహి స్తారని తెలిపారు. ఇందులో అర్హత సాధించిన బాలికలు 10 మంది, బాలురు 10 మందిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో జరిగే ఎంపికలకు పంపించనున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయి ఎంపికలకు హాజరగు బాల, బాలికలు తమ వెంట జనన ధ్రువీకరణ పత్రము, కుల ధ్రువీకరణ పత్రం, వయస్సు, స్టడీ ధ్రువీకరణ పత్రము, ప్రోగ్రెస్ రిపోర్ట్, ఆధార్ కార్డు, 5 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు (ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు) తీసుకుని రావాలని తెలి పారు. మరిన్ని వివరాలకు సెల్. 9440630681 ను సంప్రదించాలని సూచించారు.

## జాతీయ సెమినార్ ముగింపు




**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్ర రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో '' జీవ విజ్ఞాన శాస్త్రాలలో బహుళ శాస్త్రీయ పరిశోధనలలో అభివృద్ధి చెందుతున్న కొత్త దిశలు'' అనే అంశంపై జాతీయ సదస్సు కళాశాల జంతు శాస్త్ర , వృక్షశాస్త్ర శాఖల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.. ఈ జాతీయ సెమినార్ కి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ జి . శమిత హాజరయ్యారు . ఈ సందర్భంగా ప్రొఫెసర్ శమిత మాట్లాడుతూ, తసర్ సిల్క్ ఉత్పత్తిలో మాలిక్యులర్ పద్ధతులు, వాటి ఆర్థిక ప్రాధాన్యతను వివరించారు. ప్రొఫెసర్ ఎం ఇస్తారి మాట్లాడుతూ, జీవకణాల మెమొరీ, ఎపీజెనెటిక్స్, న్యూరల్ మెమొరీ వంటి అభివృద్ధి చెందుతున్న అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. ప్రొఫెసర్ వై వెంకయ్య మానవ సంక్షేమానికి మాలిక్యులర్ సాంకేతికతల ప్రాముఖ్యతను వివరించగా, ప్రొఫెసర్ ఈ. నారాయణ తన విశిష్ట అనుభవాన్ని వివరించారు . అనంతరం వివిధ కళాశాల అధ్యాపకులు సాంకేతిక సెషన్లకు చైర్ పర్సన్లుగా వ్యవహరించి చర్చలను సమర్థవంతంగా నడిపించారు . ఇందులో భాగంగా అన్ని ఉపన్యాసాలు సులభంగా అర్థమయ్యే విధంగా, విద్యార్థులకు అనుకూలంగా ఉండడంతో పాల్గొన్న పరిశోధకులు, విద్యార్థులు, అభ్యాసకులకు విశేష ప్రయోజనం చేకూరింది. ఈ సదస్సులో మౌఖిక, పోస్టర్ల ప్రదర్శనలు కూడా నిర్వహించగా అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కూడా తమ పరిశోధనలను మౌఖిక ప్రదర్శనల ద్వారా వివరించారు. ముగింపు సమావేశంలో ప్రొఫెసర్ వై వెంకయ్య ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత శాస్త్రీయ దృక్పథంను పెంపొందించడంలో ఇటువంటి జాతీయ సదస్సులు ఎంతో దోహదపడతాయని , ఆ దిశగా ఈ సెమినార్లు నిర్వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి లక్ష్మణ్ నాయక్ ,అధ్యాపక బృందానికి అభినందనలు తెలియజేశారు . ఈ సదస్సు విజయవంతంగా నిర్వహించడంలో కళాశాల నిర్వహణ,నిర్వాహక సంఘం, ఎన్సిసి , ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, బోధన, బోధ నేతర సిబ్బంది అందించిన సహకారం ప్రశంసనీయమైంది.




## విద్యార్థులకు మాలబార్ ట్రస్ట్ ఆర్థిక సహాయం

**విశ్వంభర, కూకట్ పల్లి :** కూకట్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న 31 మంది ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులకు మలబార్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఇంటర్ డిగ్రీ కళాశాల హాజరు శాతం అంతర్గత మార్కుల ప్రాతిపదికన ఎంపికైన వారిని ప్రోత్సహిస్తూ ఆర్థికంగా సహాయం చేయడం వారి కుటుంబాలకు ఎంతో కొంత చేయూతను ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ చందన ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. అధ్యాపకులు డాక్టర్ పద్మ, గోపాల్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ భార్య విమలను పరామర్శించిన డిప్యూటీ సీఎం



**విశ్వంభర, జిహెచ్ఎంసి :** దివంగత ప్రజా గాయకుడు గద్దర్ సతీమణి విమల నిమ్స్ లో గాల్ బ్లాడర్ సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. మూడు రోజుల క్రితం నిమ్స్ లో చేరిన విమలకి నేడు సర్జరీ జరగనుంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ లు నిమ్స్ లో డైరెక్టర్ బీరప్పను కలిసి విమల కు అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. విమల వెంట కుమారుడు సూర్యం, కుటుంబ సభ్యులు ఉన్నారు.

## హామీలు వెంటనే అమలు చేయాలి: రాంబాబు




**విశ్వంభర, బాగ్ లింగంపల్లి :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని భారత రాష్ట్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లిలో జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేకపోవడం, పింఛన్ అమలు కాకపోవడం వల్ల తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు. సమయానికి జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో శ్రీనివాస్, సంతోషి, శివనాయక్ పాల్గొన్నారు.

## గిరిజన గురుకులాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్



**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో గల 16 ప్రతిభ గురుకుల పాఠశాలలో (సి ఓ ఈ) 202627 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రవేశాల కొరకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రాంతీయ సమన్వయ కర్త రత్న కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం కార్యదర్శి ఆదేశాల మేరకు వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన ఈ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతోపాటు ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ లభిస్తుందని తెలిపారు. దరఖాస్తుకు చివరి తేదీ ఏప్రిల్ 7వ్ తేదీ, ఏప్రిల్ 19 పరీక్ష ఉంటుందని చెప్పారు. దరఖాస్తు రుసుము ఉచితమని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత www.tgwries.telangana.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8333800221 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని సూచించారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : ఎస్ఐ

**విశ్వంభర, నెల్లికుదురు:** సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గంజాయి, డ్రగ్ వంటి మాదకద్రవ్యాల జోలికి వెళ్ళొద్దని ఎస్ఐ చిర్ర రమేష్ బాబు మండలంలోని రామన్నగూడెం, కార్చికల్ గ్రామాల ప్రజలకు సూచించారు. రెండు గ్రామాలలో గురువారం వేరువేరుగా పాల్గొని ఆయా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. సంబంధిత గ్రామాలు వాటి పరిధిలో బైకులు నడిపే వారంతా ఏప్రిల్ 2 నుంచి తప్పనిసరిగా హెల్మెట్లు పెట్టుకొని డ్రైవింగ్ చేయాలన్నారు. కారులో వెళితే సీటు బెల్టులు ధరించాలని, యువకులు గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్ళొద్దని చెప్పారు. ఎవరైనా వాడితే తమకు సమాచారం అందించాలని కోరారు. ట్రాక్టర్లు నడిపేవారు వేగంగా వెళ్లొద్దని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలతో పాటు గ్రామాలలోని అన్ని రోడ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బండి శ్రీనివాస్, ఇట్టె లీలా దేవేందర్ రెడ్డి, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణానికి ముమ్మర ఏర్పాట్లు



**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** శ్రీరామ నవమి సందర్భంగా నగరంలోని పలు సీతారామాంజనేయ స్వామి దేవాలయాల్లో సీతారాముల కళ్యాణ వేడుకల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బాగ్ లింగంపల్లిలో అంబేద్కర్ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీ హనుమాన్ దేవస్థానం ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సీతారాముల కళ్యాణ ఘట్టానికి అనుగుణంగా ఆలయ పరిసరాలను సుందరంగా ముస్తాబు చేశారు. ప్రత్యేక వేదికలు, అలంకరణలతో కల్యాణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేపట్టారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై కళ్యాణ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

# దౌత్యంలో మోడీ ప్రభుత్వం ఘోర వైఫల్యం

## పశ్చిమాసియా యుద్ధంలో పాక్ మధ్యవర్తిత్వంపై కాంగ్రెస్ ఫైర్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**


పశ్చిమాసియా యుద్ధంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ వ్యవహరిస్తోందనే అంశం ప్రాంతీయ దౌత్యంలో మోదీ ప్రభుత్వ వైఫల్యాన్ని సూచిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ఈవిషయంలో భారత్ తత్తరపాటును కనిపించకుండా కవర్ చేసే ప్రయత్నాన్ని విదేశాంగ మంత్రి జైశంకర్ చేస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు. సీమాంతర ఉగ్రవాదం, అణ్వస్త్ర విస్తరణ, సామాన్య ప్రజలపై దాడులు చేసిన దుష్ట చరిత్ర కలిగిన పాక్ లాంటి దేశాన్ని మధ్యవర్తిత్వపాత్రకు పరిశీలించడం అత్యంత దారుణమని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

**పాక్ లాంటి దేశానికి మధ్యవర్తిత్వ అవకాశమా ?..**

"పశ్చిమాసియా యుద్ధాన్ని ముగించే చర్చలకు మధ్యవర్తిగా పాకిస్థాన్‌ను పరిగణించడం నిజంగా దారుణం. అది నాలుగు దశాబ్దాలకుపైగా భారతదేశంలో, ఇతర దేశాలలో ఉగ్రవాదాన్ని నడిపించిన దేశం. ఒసామా బిన్ లాడెన్ లాంటి భయంకరమైన ఉగ్రవాదులకు పాక్ ఆశ్రయం ఇచ్చింది. ఇతర దేశాలకు అణ్వస్త్ర టెక్నాలజీని అందించడానికి పాక్‌లోని ఏక్యూ ఖాన్ నెట్‌వర్క్ ప్రయత్నాలు చేసింది. దీని గురించి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. పాక్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్ ఈవిషయాన్ని బహిరంగంగానే అంగీకరించారు. ఈవిధంగా అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టాలను పాక్ ఘోరంగా ఉల్లంఘించింది. అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రులు, పౌర సౌకర్యాలపై పాక్ బాంబు దాడులు చేసింది. బెలూచిస్తాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో సొంత పౌరులపైనే పాక్ ఎటాక్స్ చేసింది. వివిధ ప్రావిన్సులలో మతపరమైన మైనారిటీలపై దాడులు చేసింది. అలాంటి పాక్‌కు దౌత్యపరమైన వ్యవహారాల్లో స్థానం ఉండకూడదు" అని ట్వీట్‌లో జైరాం రమేశ్ రాసుకొచ్చారు.

**మోడీ దౌత్యంలో ఆర్భాటమే తప్ప, ప్రభావం లేదు..**

"పశ్చిమాసియా యుద్ధంలో మధ్యవర్తిత్వ పాత్ర కోసం పాక్‌ను పరిగణనలోకి తీసుకోవడం అనేది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దౌత్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. మోదీ కౌగిలింతల దౌత్యం(హగ్లోమసీ) ఆర్భాటంగా ఉందే తప్ప, ప్రభావవంతంగా లేదు. భారత ప్రధాని సాహసోపేతంగా స్వేచ్ఛాయుత నిర్ణయాలను తీసుకోలేకపోతున్నారనే ఆరోపణ ఉంది. తనను తాను విశ్వగురువుగా చెప్పుకునే ప్రధాని మోదీ వైఫల్యంవల్లే చీలిపోయిన పాక్ లాంటి దేశానికి బ్రోకర్‌గా మారే అవకాశం దక్కింది. 26/11 అనంతర కాలంలో మన్మోహన్ సింగ్ హయాంలో పాక్ అంతర్జాతీయంగా ఏకాకిగా ఉండేది. అయితే 2025 ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడి జరగడానికి ముందు పాక్ సైన్యాధిపతి ఆసిమ్ మునీర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలను చేసినా, పాక్‌ను భారతదేశం ఏకాకి చేయలేకపోయింది. దీనివల్లే ఆనాడు ఆసిమ్ మునీర్ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఆపరేషన్ సిందూర్ ముగిసిన (2025 మే 10) తర్వాతే



అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఇష్టమైన వ్యక్తిగా ఆసిమ్ మునీర్ మారారు" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.

**భారత్ సమతూకమైన విదేశాంగ విధానం..**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం అఖిలపక్ష సమావేశం జరిగిన నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఈ విమర్శలు చేశారు. పశ్చిమాసియా సైనిక ఉద్రిక్తతల విషయం లో భారత్ సమతూకమైన విదేశాంగ విధానంతోనే ముందుకు సాగుతుందని ఆ సమావేశంలో ప్రతిపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ సమావేశంలో విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, విదేశాంగ మంత్రి జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మాట్లాడుతూ ఇంధన భద్రత, నౌకాయానం, విదేశాల్లో ఉన్న భారత పౌరుల భద్రతపై వివరించారు. పశ్చిమాసియా ప్రాంతంలోని అన్ని పక్షాలతో భారత్ దౌత్య సంబంధాలను కొనసాగిస్తోందని, సప్లై చైన్‌లను తెరిచి ఉంచుతోందని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌కు చెందిన ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, జావేద్ అలీ, సీపీఐ(ఎం)కు చెందిన జాన్ బ్రిట్టాస్, డీఎంకేకు చెందిన పి. విల్సన్, ఆప్‌కు చెందిన సంజయ్ సింగ్ సహా పలువురు ప్రతిపక్ష నాయకులు హాజరయ్యారు. అయితే, తృణమూల్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనలేదు.

## ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఉండమన్నారు.. ట్రంప్ ప్రగల్భాలు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



యుద్ధం ముగింపునకు సంబంధించి అమెరికాతో ఎలాంటి చర్చలు జరగట్లేదని ఓవైపు ఇరాన్ చెబుతుండగా.. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్చలు కొనసాగుతున్నట్లు పదే పదే చెబుతున్నారు. తాజాగా ఈ వ్యవహారంపై మరోసారి స్పందించిన ట్రంప్ ఆసక్తికర వ్యా ఖ్యలు చేశారు. తనను ఇరాన్ సుప్రీంలీడర్‌గా ఎన్నుకొంటామని అన్నారంటూ ప్రగల్భాలు పలికారు. రిపబ్లికన్ పార్టీ విరాళాల సేకరణ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు. "ఇరాన్‌పై సైనిక విధ్వంసానికి పాల్పడ్డాం. ఈ యుద్ధంలో మేం భారీ విజయాన్ని సాధించబోతున్నాం. ఇంతవరకూ పశ్చిమాసి యాలో ఎవరూచూడని విక్టరీ అది. ఇక, యుద్ధం ముగింపు విషయంలో మేం చర్చలు జరుపుతున్నాం. ఆ ఒప్పందం కోసం ఇరాన్ ప్రాధేయపడింది. కానీ, ఆ విషయాన్ని వారు బయటకు చెప్పట్లేదు. ఎందుకంటే సొంత ప్రజల చేతుల్లోనే హత్యకు గురవుతారని వారు భయపడుతున్నారు" అని ట్రంప్ పేర్కొన్నారు.

## హర్మూజ్‌లో దాడి.. ఇరాన్ కీలక నేత మృతి

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

ఇరాన్‌గుప్పిట్లో ఉన్న హర్మూజ్ జలసంధి ప్రాంతంలో ఇజ్రాయెల్ మెరుపు దాడులు చేసింది. ఈ దాడిలో ఇరాన్ నేవీ చీఫ్ అలిరెజా తంగ్సిరీ మరణించినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు ప్రకటించాయి. ఇరాన్ సముద్ర తీర రక్షణ, హర్మూజ్ జలసంధిపై పట్టు సాధించడంలో అలిరెజా తంగ్సిరీ కీలక పాత్ర పోషించారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ నేవికా దళానికి నాయకత్వం వహిస్తున్న తంగ్సిరీని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ ఈ దాడి చేయడం, ఇరాన్ సైనిక ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే చర్యగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ దాడితో ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య ప్రత్యక్ష యుద్ధం మరింత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఈ పరిణామం వల్ల ప్రపంచ చమురు రవాణాకు గుండెకాయ వంటి హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంఫరా అయ్యే ముడి చమురులో దాదాపు 20% ఈ జలసంధి గుండానే వెళ్తుంది. ఇప్పుడు తమ నేవీ చీఫ్ మరణానికి ప్రతీకారంగా ఇరాన్ ఈ మార్గాన్ని మూసివేసే అవకాశం ఉందనే భయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఇరాన్ గనుక హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తే, అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయం. ఇప్పటికే అమెరికా తన దళాలను రక్షణ కోసం మోహరించినప్పటికీ, ఇరాన్ తన క్షిపణి వ్యవస్థలతో పశ్చిమ దేశాల నౌకలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉంది. తంగ్సిరీ మరణం ఇరాన్ సైన్యానికి తీరని లోటు కాగా, దీనికి ఇరాన్ ఏ విధంగా స్పందిస్తుందనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

## 16ఏళ్లుగా కరెంట్, నీరు, మరుగుదొడ్లు లేవు..


### ఎన్నికలను బహిష్కరించిన 50 కుటుంబాలు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

తమిళనాడులో ఎన్నికల హడావుడి మొదలైంది. మరో 10 రోజుల్లో నామినేషన్ ప్రక్రియ కూడా మొదలుకానుంది. ఇప్పటికే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను రాజకీయ పార్టీలు విడుదల చేశాయి. ఈ ఎన్నికల్లో ఎలాగైన గెలవాలనిపార్టీలు తమవ్యూహాలను రచిస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు పలు రకాల హామీలు ప్రకటిస్తున్నాయి. అయితే తిరుచిరాపల్లిలోని ఓ 50 కుటుంబాలు మాత్రం అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నాయి. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న సమయంలో ఆ కుటుంబాలు అసలెందుకు ఈ నిర్ణయం తీసుకున్నాయి? అందుకు గల కారణం ఏంటో ఈ కథనంలో తెలుసుకుందాం. తిరుచిరాపల్లిలోని నందవనం గ్రామానికి చెందిన 50కు పైగా కుటుంబాలు కలిసి ఈ కీలక నిర్ణయం తీసుకున్నాయి. గత 16 ఏళ్లుగా విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్డు వంటి ప్రాథమిక సదుపాయలు లేకుండా జీవిస్తున్నారని, అందుకే రానున్న అసెంబ్లీ ఎన్నికలకు బహిష్కరించాలని ప్రకటించాయి. జాతీయ రహదారిని విస్తరించే సమయంలో తమ ఇళ్లను ఖాళీ చేయించి నందనవం గ్రామానికి తరలించారని, కానీ ఇక్కడ సదుపాయాలు ఏం లేవని వాపోతున్నారు. తమకు ఇంత వరకు విద్యుత్, నీరు, వ్యవసాయానికి మద్దుతు వంటి ప్రాథమిక అవసరాలు కల్పించలేదని నందవనం గ్రామనికి చెందిన స్థానికుడు తంగరాజ్ తెలిపాడు.

**హైవే విస్తరణ తర్వాత పునరావాసం- కానీ సదుపాయాలే లేవు..**

'నందవనం ప్రాంతంలో గత 16 ఏళ్లుగా ప్రజలు విద్యుత్ లేకుండా జీవిస్తున్నారు. మేం ముందుగా జాతీయ రహదారి పక్కన ఉండేవాళ్లం. హైవే విస్తరణసమయంలో అప్పటి ప్రభుత్వంమమ్మల్ని ఇక్కడికిమార్చింది. అప్పటి నుంచి మమ్మల్ని పూర్తిగా మర్చిపోయారు. ఇప్పటి వరకు నలురుగు ముఖ్యమంత్రులు మారారు. కానీ మానవ మనుగడకు అవసరమైన కరెంట్, త్రాగునీరు, మరుగుదొడ్లు, వ్యవసాయానికి మద్దతు వంటి అంశాల్లో ఎవరూ సహాయం చేయలేదు' అని తంగ్?రాజ్ పేర్కొన్నాడు.



**పిటిషన్లు పెట్టినా స్పందన లేదు..**

తమ సమస్యలపై అనేకసార్లు తమిళనాడు ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తంగరాజ్ ఆరోపించారు. దీంతో ప్రాథమిక సదుపాయాలు కల్పించే వరకు ఎన్నికలను బహిష్కరించాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

**వర్షాకాలంలో పాముల బెడద..**


మరో స్థానికురాలు సరోజా కూడా ఇదే ఆవేదనను వ్యక్తం చేసింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీలు ఇస్తున్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నాయని తెలిపింది. 'గత 16 ఏళ్లుగా మేం కరెంట్, మరుగుదొడ్డు లేకుండా గుడిసెల్లో జీవిస్తున్నాం. ప్రతి ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు హామీలు ఇస్తాయి. కానీ ఇప్పటివరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. విద్యుత్ లేకపోవడం వల్ల ముఖ్యంగా వర్షాకాలంలో పాములు వంటి ప్రమాదకర జీవులు ఇళ్లలోకి వస్తుంటాయి. సరైన వెలుతురు లేకపోవడం వల్ల మా ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. ఇప్పటికీ ఎవరూ కనీస సదుపాయాలు కూడా కల్పించలేదు. అందుకే ఈసారి ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నాం' అని సరోజా వెల్లడించింది.

## పశ్చిమాసియా ఘర్షణల వేళ.. రష్యా నుంచి ఇరాన్‌కు డ్రోన్లు..!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

అమెరికా-ఇజ్రాయెల్‌తో యుద్ధం చేస్తోన్న ఇరాన్‌కు రష్యానుంచి సహాయం అందుతున్నట్లు తెలుస్తోంది. ఆ దేశానికి పుతిన్ ప్రభుత్వం దశలవారీగా డ్రోన్లను డెలివరీ చేస్తోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈనెలాఖరుకు ఆరవాణా పూర్తికానుందని వెల్లడించాయి. డ్రోన్లతో పాటు ఆహారం, ఔషధాలను కూడా పంపిస్తోందని రాసుకొచ్చాయి. "ఇరాన్ అభివృద్ధి చేసిన డ్రోన్లను రష్యా తయారుచేస్తోంది. వాటిని ఉక్రెయిన్ యుద్ధంలో ఉపయోగిస్తోంది. ఇరాన్ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ షిప్‌మెంట్లు చేస్తోంది" అని పశ్చిమదేశాల నిఘా సమాచారాన్ని ఉటంకించాయి. అమెరికా యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, సైనిక స్థావరాల గురించి ఇరాన్‌కు రష్యా 'రియల్ టైమ్ ఇంటెలిజెన్స్' సహకారం అందిస్తోందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పశ్చిమా సియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆ సమాచారాన్ని ఇరాన్‌కు రష్యా చేరవేస్తోందని వాటి సారాంశం. ఇక తాజా కథనాలపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి స్పందించారు. "ప్రస్తుతం చాలా నకిలీ వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడ ఒకటి మాత్రం వాస్తవం. ఇరాన్ నాయకత్వంతో మా సంప్రదింపులు కొనసాగిస్తున్నాం" అని స్పష్టం చేశారు.

**ఇరాన్‌లోని రష్యా ఉద్యోగులు వెనక్కి..**



ఇరాన్‌లోని బుషెహర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నుంచి తన ఉద్యోగులను రష్యా వెనక్కి రప్పించింది. మంగళవారం ఈ ప్లాంట్‌పై క్షిపణి పడిన నేపథ్యంలో 163 మంది సిబ్బందిని అక్కడినుంచి తరలించింది. ఈ ప్లాంట్‌ను నిర్మించింది రష్యానే. మిగతా యూనిట్ల నిర్మాణం కోసం అక్కడ కొందరు సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి అక్కడ కార్యకలాపాలను నిలిపివేసింది.

## అమెరికా వెళ్తున్నారా..? ఇకపై మరిన్ని వీసాలకు 'సోషల్ వెట్టింగ్'

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే హెచ్-1బీ వంటి కొన్ని వీసాలకు 'సోషల్ మీడియా వెట్టింగ్ 'ను అమలుచేస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ నిబంధనను మరిన్ని వీసా కేటగిరీలకు తప్పనిసరి చేసింది. మార్చి 30 నుంచి ఈ కొత్త రూల్స్ అమల్లోకి రానున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది.

ఏ-3, సీ-3 (డొమెస్టిక్ వర్కర్లు), జీ-5, హెచ్-3, హెచ్-4 (హెచ్-3 డిపెండెంట్స్), కె, క్యూ, ఆర్, ఎస్, టీ, యూ వీసాల దరఖాస్తుదారులకు కూడా ఇకనుంచి 'సోషల్ వెట్టింగ్' చేయనున్నారు. జాతీయ భద్రత పేరుతో గతేడాది ఈ నిబంధనను అమెరికా తీసుకొచ్చింది. గత డిసెంబరు నుంచి హెచ్1బీ, హెచ్4, ఎఫ్, ఎం, జే వీసాలకు దరఖాస్తు చేసుకునేవారి ఆన్‌లైన్ యాక్టివిటీని క్షుణ్ణంగా తనిఖీ చేస్తోంది.

**సోషల్ మీడియా వెట్టింగ్ ..**

వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేస్తారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా




మంజూరు చేస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమ సామాజిక మాధ్యమ ఖాతాల సెట్టింగ్‌లను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో వారు ఎలాంటి కంటెంట్ పోస్ట్ చేస్తున్నారు? వారివల్ల అమెరికా భద్రతకు ముప్పు ఉందా? అన్న కోణంలో అధికారులు ఈ తనిఖీలు చేస్తారు.

## ప్రధానిపై ఏఐ వీడియోలు.. 'ఎక్స్'పై సైబర్ పోలీసుల కేసు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



ఏఐ జనరేటెడ్ వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలోవిపరీతంగా వాడేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ప్రధాని మోడీ ఎన్నికల కమిషన్‌పై ఏఐ ఆధారిత వీడియోలు ఎక్స్‌లో(ఠ) చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలోనే కేరళకు చెందిన సైబర్ పోలీసులు సదరు సామాజిక మాధ్యమంపై కేసు నమోదు చేశారు. "ఆ వీడియోలు ప్రజలను తప్పుదారి పట్టించేలా, దేశ ప్రధాని,ఎలక్షన్ కమిషన్ పరువుకు భంగం కలిగేలా ఉన్నాయి. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణపై ప్రతికూల ప్రభావం చూపేవిధంగా వాటిని రూపొం దించారు. అందుకే వాటిపై చర్యలు తీసుకోవాల్సి వచ్చింది" అని సైబర్ పోలీసులు వెల్లడించారు. ఎక్స్ సంస్థతో పాటు ఆ ఏఐ వీడియోలు పోస్ట్ చేసిన ఓ యూజర్ ఖాతాపై కూడా తిరువనం తపురంలోని సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వార్ ఎఫెక్ట్.. దేశంలో ఊపందుకున్న పర్యాటకం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ దేశాల్లో పర్యాటక రంగానికి బ్రేక్ పడింది. యుద్ధం వేళ ఆయా దేశాలకు వెళ్లేందుకు పర్యటకులు భయపడుతున్నారు. ఈ క్రమంలోనే భారతీయులు కూడా గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు చేసుకొన్న తమ వేసవి విహారయాత్రలను రద్దు చేసుకుంటున్నారు. దీంతో మన దేశంలోని టూరిస్టు ప్రాంతాలకు డిమాండ్ పెరిగింది. ఈ పరిణామాలు స్వదేశీ పర్యటకానికి ఊతమిస్తున్నాయి. వేసవి సెలవుల్లో అమెరికా, ఐరోపా దేశాలను సందర్శించేందుకు ఇప్పటికే ప్రణాళిక వేసుకొన్న టూరిస్టులు పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణానికి భయపడి ప్రస్తుతం దేశంలోని ప్రముఖ పర్యటక ప్రాంతాల వైపు మొగ్గు చూపుతున్నారు. లద్దాఖ్, రిషికేశ్, శిమ్లా, మనాలీ, షిల్లాంగ్ వంటి శీతల ప్రదేశాలను వేసవిలో సందర్శించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పర్యటకుల్లో దాదాపు 65% మంది దేశంలోని వివిధ ప్రాంతాలను చుట్టేసేందుకు ప్లాన్ చేసుకుంటున్నట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, లద్దాఖ్ వంటి ప్రాంతాలకు గతంతో పోలిస్తే ఇప్పుడు 30శాతం బుకింగ్‌లు పెరిగాయి. 23శాతం మంది ఆధ్యాత్మిక పర్యటనలకు ఆసక్తి చూపిస్తున్నారు. అలాగే విదేశీ పర్యటనలకు వెళ్లాలనుకునే వారు ఎక్కువగా వియత్నాం, నేపాల్, శ్రీలంక, ఇండోనేసియా, సింగపూర్, థాయ్‌లాండ్‌లను ఎంచుకుంటున్నట్లు ట్రావెల్ ఏజెన్సీల గణాంకాలు తెలిపాయి.

## 'వందేభారత్' భోజనంలో పురుగులు.. ఐఆర్‌సిటిసికి రూ.10 లక్షల జరిమానా

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో అందించిన ఆహారంలో పురుగులు కన్పించడం తీవ్ర వివాదాస్పదమైంది. తమకు ఇచ్చిన భోజనంలో పురుగులు ఉన్నాయంటూ రితేష్‌కుమార్ అనే ప్రయాణికుడు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన రైల్వేశాఖ.. ఐఆర్‌సీటీసీకి జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే..రితేశ్‌కుమార్ మార్చి 15న పట్నా-టాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. ఆ సమయంలో తమకు అందించిన భోజనంలోని పెరుగులో పురుగులు రావడంతో ఆయన కంగుతిన్నారు. వెంటనే మేనేజర్‌ని పిలిచి ఫిర్యాదు చేశారు. రైలు సిబ్బంది ఆ భోజనాన్ని పరిశీలించారు. ఇదంతా రితేశ్ వీడియో తీసి సోషల్ మీడియాలోపోస్ట్ చేశారు. ఇదికాస్తా వివాదాస్పదం కావడంతో రైల్వే మంత్రిత్వశాఖ ఎక్స్‌లో స్పందించింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధిస్తున్నట్లు వెల్లడించింది. ఆ రైల్లో కేటరింగ్ చేసిన ఫుడ్ సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.50 లక్షల జరిమానాతో పాటు అతడి కాంట్రాక్టును రద్దు చేసినట్లు తెలిపింది. ప్రయాణికుల భద్రత, రైల్వే సౌకర్యాల్లో నాణ్యతే తమ ప్రథమ ప్రాధాన్యమని రైల్వేశాఖ వివరించింది.


## హర్మూజ్‌లో నౌకలకు ఇరాన్ 'టోల్ ఫీజులు'

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పశ్చిమాసియాలో చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిని భారత్ సహా ఐదు మిత్ర దేశాల కోసం తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ మార్గంలో ప్రయా ణించే నౌకల నుంచి ఇరాన్ రివల్యూషనరీ గార్డులు అనధికారికంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు తాజాగా బయటికొచ్చింది. ఇందుకోసం 'టోల్ బూత్' వ్యవస్థను నడుపుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు షిప్పింగ్ న్యూస్ వెబ్‌సైట్ లాయిడ్స్‌లిస్ట్ సంచలన విషయాలను వెల్లడించింది. మార్చి 13 నుంచి ఈ ఫీజులను అమలుచేస్తున్నట్లు తెలిపింది. ఐఆర్‌జీసీ నిర్దేశించిన టోల్ సిస్టమ్ నిబంధనలు పూర్తి చేసి ఇప్పటివరకు 26 నౌకలు హర్మూజ్‌ను దాటినట్లు పేర్కొంది. ఇందుకోసం ఆయా నౌకలు సంబంధిత పత్రాలు సమర్పించి, క్లియరెన్స్ కోడ్‌లు పొందినట్లు తెలిపింది. అంతేగాక, ఈ నౌకలు సాధారణ మార్గాల్లో ప్రయాణించలేదని లాయిడ్స్‌లిస్ట్ ఇంటెలిజెన్స్ డేటా వెల్లడించింది. ఇరాన్ అధికారులు అనుమతించిన మార్గాల్లోనే ఇవి వెళ్లాయని చెప్పింది. మార్చి 15 నుంచి హర్మూజ్‌లోని సాధారణ రూట్‌లో ఒక్క నౌక కూడా ప్రయాణించినట్లు ట్రాకింగ్‌లో తేలలేదని పేర్కొంది. ఉద్రిక్తతల తర్వాత నుంచి గురువారం నాటికి భారత్‌కు వచ్చే ఐదు నౌకలు హర్మూజ్‌ను సురక్షితంగా దాటాయి. వీటిల్లో మూడు ఇప్పటికే దేశీయ పోర్టులకు చేరుకోగా.. రెండు నౌకలు జగ్ వసంత్, పైన్ గ్యాస్ ఈ వారాంతానికి భారత్‌కు రానున్నాయి. అయితే, మన నౌకలు కూడా టోల్ చెల్లించాయా? లేదా అన్న దానిపై స్పష్టత లేదు. ఇరాన్ విదేశాంగ మంత్రి చేసిన ప్రకటనలోనూ దీని గురించి ప్రస్తా వించలేదు. వాస్తవానికి హర్మూజ్‌ను దాటేందుకు నౌకల నుంచి ఇరాన్ 2 మిలియన్ డాలర్ల (రూ.18 కోట్లు) చొప్పున ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. కానీ, వీటిని భారత్‌లోని ఇరాన్ దౌత్య కార్యాలయం ఖండించింది. అవి పూర్తిగా అవాస్తవమని పేర్కొంది. ఫీజులకు సంబంధించి కొందరు వ్యక్తులు చేస్తోన్న ఆరోపణలకు, ఇరాన్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇచ్చింది. ఆ సమయంలో భారత్ కూడా వీటిని తోసిపుచ్చింది. కానీ, తాజాగా షిప్పింగ్ న్యూస్ వెబ్‌సైట్ వార్త రావడంతో దీనిపై గందరగోళం నెలకొంది. భారత్ సహా చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ నౌకలు హర్మూజ్ మీదుగా వెళ్లొచ్చని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. దీంతో హర్మూజ్ జలసంధికి ఇరువైపులా చిక్కుకుపోయిన భారత్ నౌకలు సరకులతో తమ గమ్యస్థానాలు చేరేందుకు మార్గం సుగమమైంది.

## ఇంధన సంక్షోభం.. పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచిన నయారా

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ప్రస్తుతం దేశీయ చమురు మార్కెట్‌లో నెలకొన్న పరిణామాలు వాహనదారులకు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో పెట్రోల్ కోసం బంకుల వద్ద కిలోమీటర్ల మేర వాహనదారులు క్యూ కడుతుండగా.. ప్రయివేట్ రంగ సంస్థ అయిన నయారా ఎనర్జీస్ పెట్రోల్, డీజిల్ రేట్లను భారీగా పెంచింది. రష్యాకు చెందిన ప్రముఖ చమురు సంస్థ 'రాస్‌నెఫ్ట్' భాగస్వామ్యం కలిగిన నయారా ఎనర్జీ.. లీటరు పెట్రోల్‌పై దాదాపు రూ. 5, డీజిల్‌పై రూ. 3 వరకు పెంచి సామాన్యుడికి షాక్ ఇచ్చింది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు అస్థిరంగా ఉండటంతోపాటు సప్లై చైన్ లో ఏర్పడిన అంతరాయాల కారణంగా ఇంధన ధరలు పెంచుతున్నట్టు తెలిపింది. దేశవ్యాప్తంగా దాదాపు 7,000 అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న ఈ సంస్థ.. పెరిగిన ధరలను ఇప్పటికే అమలులోకి తెచ్చింది. వివిధ రాష్ట్రాలు విధించే వ్యాట్ ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో ఈ పెంపు గరిష్టంగా లీటరుకు రూ. 5.30 వరకు చేరనుంది. మరోవైపు దేశంలో 90 శాతానికి పైగా మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వ రంగ సంస్థలైన ఐవోసీఎల్, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలను ప్రస్తుతానికి స్థిరంగా ఉంచడం వాహనదారులకు పెద్ద ఊరటనిస్తోంది. కాని ఇండస్ట్రియల్ డీజిల్ ధరలను లీటరుకు ఏకంగా రూ. 22 మేర పెంచడం మిగతా పరిశ్రమలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇక మరో ప్రముఖ ప్రైవేటు సంస్థ రిలయన్స్-బీపీ మాత్రం యథాతథంగా పాత ధరలనే కొనసాగిస్తోంది.

## బావ గారు కాదు.. చిరు నా అన్నయ్యే
### పవన్ సతీమణి పోస్ట్



పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా ఇన్‌స్టాలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. తాజాగా ఆమె చిరంజీవి, నాగబాబులతో తన అనుబంధాన్ని పంచుకుంటూ పెట్టిన ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. 'అన్నయ్యనా.. బావగారా?' అంటూ వారిద్దరితో దిగిన ఫొటోలను పంచుకున్నారు. ''ఒకరిపై ఒకరు ఎప్పుడూ ప్రేమానురాగాలు చూపిస్తూ ఉండే ఈ మెగా కుటుంబంలోకి దాదాపు 15 ఏళ్ల క్రితం అడుగుపెట్టాను. వచ్చిన కొత్తల్లో ఇక్కడ ఎలా ఉండాలో.. ఎవరిని ఎలా పిలవాలో అర్థంకాలేదు. దీంతో నా భర్త వాళ్లను ఎలా పిలుస్తున్నారో గమనించి.. నేను అలానే పిలిచేదాన్ని. చిరంజీవిని అన్నయ్య అని, నాగబాబుని చిన్నన్నయ్య అని అనేదాన్ని. మొదట మామూలుగా అన్నయ్య అని పిలిచా.. కానీ, ఆ తర్వాతే ఆ బంధం గొప్పతనం అర్థమైంది. తర్వాత నేను బావగారు అని పిలవడం నేర్చుకొన్నా. నాకు సోదరులు లేరు.. కానీ, ఈ బంధం నాకు చిరంజీవి , నాగబాబుల రూపంలో ఇద్దరు సోదరులను ఇచ్చింది'' అని చెప్పారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. గంట కూడా కాకముందే లక్షకు పైగా లైక్‌లు వచ్చాయి. ఇక బుధవారం ఆమె ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేయగా.. 24 గంటలు కూడా కాకముందే 2లక్షల 40 వేల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. ఎంతోకాలంగా ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేయాలని అనుకుంటున్నానని.. ఇప్పుడు సరైన సమయం వచ్చిందని అందుకే ఓపెన్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.



## ఆస్వాదించండి విమర్శించకండి

బిటౌన్ బ్యూటీ దిశా పటాని 'కల్కి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ప్రభాస్, రాజమౌళి కాంబినేషన్‌లో వచ్చిన ఈ మూవీలో పాన్ ఇండియా రేంజ్‌లో విజయం అందుకున్నప్పటికీ.. ఇందులో దిశ పాత్రకు మాత్రం అంతగా బజ్ రాలేదు. అయితే.. రీసెంట్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ బ్యూటీ కల్కి 2లో మాత్రం తన పాత్ర చాలా కీలకంగా ఉండబోతున్నట్లు తెలుపగా ఈ యంగ్ బ్యూటీ ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఇక సినిమాల విషయం పక్కన పెడితే నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ బోల్డ్ బ్యూటీ.. తన గ్లామర్‌తో యూత్‌ను మెస్మరైజ్ చేస్తూ ఉంటుంది. అలాగే బోల్డ్ లుక్‌లో కనిపించడంతో విమర్శలు సైతం ఎదురవుతుంటాయి. ఇందులో భాగంగానే రీసెంట్‌గా ఓ ఈవెంట్‌లో తాను ధరించిన దుస్తులపై నెట్టింట ట్రోల్స్ స్టార్ట్ అయ్యాయి. రీసెంట్ ఇంటర్వ్యూలో నెగిటివ్ కామెంట్స్‌పై స్పందించిన దిశ.. 'నటీమణులను అభినందించండి తప్ప, వారు ధరించే దుస్తులను విమర్శించకండి. అంతేకాకుండా, ఆకర్షణ అండ్ అసభ్యత మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోకుండా ఎవరూ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టరు. మేము గ్లామర్‌గా ఉండి అందరిని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తాం కానీ అసభ్యకరంగా ఉండము' అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## సెన్సార్ పూర్తి చేసుకున్న 'రాకాస'



సంగీత్ శోభన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న హర్రర్ కామెడీ చిత్రం 'రాకాస' ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'U/A' సర్టిఫికేట్ మంజూరు చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. హర్రర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుందని చిత్రబృందం నమ్మకంగా ఉంది. మానస శర్మ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను, రోహిణి, అనూప్ సింగ్, వాసు ఇంటూరి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, జీ స్టూడియోస్ బ్యానర్లపై నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సల్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.

## సంజయ్ కిషోర్ కృషి అభినందనీయం

సినీ తేజోమూర్తులు చరిత్రను గ్రంథాలుగా వెలువరిస్తూ పాఠకులకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్న సంజయ్ కిషోర్ కృషి అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందం అన్నారు. గురువారం సైఫాబాద్‌లోని హోటల్లో సంగమం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళా రత్న పురస్కారాన్ని పొందిన సంజయ్ కిషోర్‌కు ఆత్మీయ సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ.. సంజయ్ కిషోర్ ఎంతో మంది నటీనటుల జీవిత చరిత్రను గ్రంథాలుగా తీసుకరావడమే కాకుండా సినీ రివ్యూలతో తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఫొటో బయోగ్రఫీకి ఆద్యుడిగా నిలిచి సాంస్కృతిక వారసత్వానికి చేస్తున్న కృషిని కొనియాడారు. అంతకుముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సినీ నటి మంజు భార్గవి, అన్నమయ్య పద కోకిల శోభరాజ్, దర్శకుడు రేలంగి నరసింహారావు, నటులు శివ పార్వతి, జయలలితలతో పాటు సంగమం ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## రోడ్డెక్కి చూడండి పెట్రోల్ కష్టాలు తెలుస్తాయ్.. పాక్ ప్రభుత్వంపై నటి ఫైర్



ఇరాన్‌ఇజ్రాయెల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ప్రపంచదేశాల్లో ఇంధన కొరత తీవ్రంగా ఏర్పడింది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి నుంచి చమురును రవాణా చేసుకునే దేశాలు తీవ్ర సంక్షోభం దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ యుద్ధ ప్రభావం ముస్లిం కంట్రీస్‌పై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. తాజాగా పాక్‌లో పెట్రోల్ ధరలు ఆకాశానంటాయి. లీటరు ధర రూ.300లకు చేరుకోవడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ధర పెరిగినా పెట్రోల్ దొరకకపోవడంతో అన్నివర్గాల ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. ఈ నేపథ్యంలో పాక్ ప్రభుత్వం, అక్కడి ప్రతిపక్షనాయకులపై ప్రముఖ నటి, టీవీ హోస్ట్ సాదియా ఇమామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పెట్రోల్ ధరల పెరుగుదల, అక్కడి నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ వీడియోని రిలీజ్ చేసింది. సాదియా ఇమామ్ మాట్లాడుతూ.. "మీరు అందరూ చచ్చిపోతే పోయేదేముంది? కొత్తవాళ్లు వస్తారు, కొత్త ఆలోచనలు వస్తాయి. పెట్రోల్ ధరలు అనవసరంగా పెంచుతున్నారు. పాత స్టాక్ ఉన్నప్పటికీ కొత్త ధరలు ఎలా నిర్ణయిస్తారు? భారతదేశం, బంగ్లాదేశంలో అలా పెంచలేదు కదా? ఇరాన్ నుంచి చౌకగా పెట్రోల్ కొనుగోలు చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు దానిని వినియోగించుకోవడం లేదు?'' అని ఆమె ప్రశ్నలను సంధించింది. అలాగే ఆ దేశ మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, బిలావల్ భుట్టో జర్దారీ, ఇతర నాయకులను ఉద్దేశించి సాదియా ఘాటు వ్యాఖ్యలు చేసింది. ''ప్రజలు రోడ్లెక్కి ఇబ్బంది పడుతుంటే మీరు ఎక్కడున్నారు? ప్రజల సమస్యలు మీకు కనిపించడం లేదా? ఐఎంఎఫ్ అప్పుల కారణంగా దేశం ఆర్థిక ఒత్తిడిలో ఉంటే కనిపించడం లేదా'' అంటూ నిలదీసింది. ప్రస్తుతం సాదియా ఇమామ్ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. మరోవైపు నెటిజన్స్ సైతం ఆమెకు మద్దతు తెలుపుతున్నారు. ఇలా ప్రభుత్వాన్ని ప్రశ్నించేవాళ్లు ఉండాలని కితాబు ఇస్తున్నారు.

## రవితేజ 'ఇరుముడి' నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్



హిట్, ఫ్లాప్స్‌తో సంబంధం లేకుండా వరుస చిత్రాలు చేస్తున్న మాస్ మహారాజా రవితేజ ఈ ఏడాది 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. సంక్రాంతి స్పెషల్‌గా రిలీజైన ఈ చిత్రం పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఈ సినిమా సక్సెస్ తర్వాత రవితేజ తన 77వ చిత్రంపై ఫోకస్ పెట్టాడు. 'ఇరుముడి' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నాడు. యాక్షన్ రివేంజ్ డ్రామాగా రూపొందుతోన్న ఈ మూవీలో తండ్రి పాత్రలో రవితేజ కనిపించబోతున్నాడు. ఇప్పటికే ఇందులో నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చెయ్యగా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా శ్రీరామనవమి పండుగ సందర్భంగా స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'ప్రేమ, ఆప్యాయతతో ముడిపడిన ఒక తండ్రి, ముచ్చటైన కూతురి కథ' అనే క్యాప్షన్ ఇచ్చి షేర్ చేసిన ఈ పోస్టర్‌లో రవితేజ తన కూతురుతో ఎంతో సంతోషంగా ఉన్నట్లు చూపించారు. ప్రజెంట్ ఈ పోస్టర్ నెట్టింట విశేషంగా ఆకట్టుకుంటోంది. కాగా.. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా, సాయి కుమార్, అజయ్ ఘోష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్ త్వరలో ప్రకటించనున్నారు మేకర్స్.

## రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పేరు మార్పుపై క్లారిటీ




**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఐపీఎల్ 2026 నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు కొత్త ఓనర్ షిప్ వచ్చింది. అయితే ఈ నేపథ్యంలో బెంగుళూరు జట్టు పేరు మార్చుతారని సోషల్ మీడియాలో తెగ ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారానికి RCB యజమానులలో ఒకరైన అనన్య బిర్లా క్లారిటీ ఇచ్చారు. RCB పేరులో ఎలాంటి మార్పు ఉండబోదని కుండబద్దలు కొట్టి చెప్పారు. ఇక పైన కూడా పాత పేరుతో జట్టు కొనసాగుతుందని ప్రకటన చేశారు.దీంతో బెంగళూరు అభిమానులు సంబరపడిపోతున్నారు. ఇది ఇలా ఉండగా, RCB జట్టును రూ.16,706 కోట్లకు ఆదిత్య బిర్లా, బ్లాక్ స్టోన్, డేవిడ్ బ్లేజర్, TOI కొనుగోలు చేశారు. మార్చి 31వ తేదీన RCB జట్టును టేకోవర్ చేసుకోబోతున్నారు. కాగా ఐపీఎల్ 2026 నేపథ్యంలో బెంగళూరు తన తొలి మ్యాచ్ సన్ రైజర్స్ హైదరాబాద్ తో ఆడనుంది. ఈ మ్యాచ్ చిన్న స్వామి స్టేడియం వేదికగా నిర్వహించనున్నారు.

## తొలి ఐపీఎల్ ట్రోఫీ గెలవాల్సిందే
### - ఎల్ఎస్‌జీ యజమాని సంజీవ్ గొయెంకా



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఐపీఎల్ 2026 సీజన్ శనివారం నుంచే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ యజమాని సంజీవ్ గొయెంకా కీలక వ్యాఖ్యలు చేశారు. జట్టు ప్లేఆఫ్స్‌నకు చేరుకుంటేనే సరిపోదని, తన తొలి ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకోవాలన్నారు. 'మా నిజమైన గుర్తింపు ఇంకా రూపుదిద్దుకుంటోందని నేను భావిస్తున్నా. ఏ క్రీడా జట్టుకైనా ట్రోఫీ గెలిస్తేనే గౌరవం. మేము ఇప్పటి వరకు రెండుసార్లు ప్లేఆఫ్స్‌నకు చేరుకున్నాం. కచ్చితంగా ఇది సరిపోదు. కొన్నిసార్లు గెలుస్తాం. మరి కొన్నిసార్లు ఓడిపోతాం. కానీ మేం మా మొదటి ట్రోఫీని గెలవాలి' అని సంజీవ్ గొయెంకా అన్నారు. అలాగే.. గత సీజన్‌లోని అంశాలను ప్రస్తావిస్తూ, తమ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ సమస్యను తాము పరిష్కరించామనే అనుకుంటున్నామన్నారు.'గత సీజన్‌లో ఎల్ఎస్‌జీ ప్రధాన బౌలర్లలో చాలా మంది గాయపడినప్పటికీ, మేము ఆడిన మొదటి ఆరు మ్యాచుల్లో నాలుగింట్లో గెలవడం సానుకూలాంశం. మేము సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాం. ఐడెన్ మార్‌క్రమ్, మిచెల్ మార్ష్‌లను ఓపెనింగ్‌కు పంపించాం. అది వారిద్దరికీ అత్యుత్తమ ఐపీఎల్ సీజన్‌గా నిలిచింది. దిగ్వేశ్ రాఠీ కొత్త ఆటగాడిగా జట్టులోకి వచ్చి చక్కగా రాణించాడు. అయితే, మాకు బలమైన బౌలింగ్ విభాగం లేదని మేం గ్రహించాం. అందుకే ఈసారి ఆ లోటును పూరించాం' అని పేర్కొన్నారు.

## ఓపెనర్ అతడు కాదు.. నేనే
### - రుతురాజ్ గైక్వాడ్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆయుష్ మాత్రే చెన్నై సూపర్ కింగ్స్‌కు ఓపెనింగ్ చేయడం లేదని కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ తెలిపాడు. సంజుశాంసన్‌తో కలిసి తానే ఓపెనింగ్ చేస్తానని వివరించాడు. ఈ విషయాన్ని అతడు ఐపీఎల్ కెప్టెన్స్ డే ఈవెంట్ అనంతరం వెల్లడించాడు. ఈ విషయమై టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా స్పందించాడు. 'రుతురాజ్ గైక్వాడ్, సంజుశాంసన్‌కు మంచి నేపథ్యం ఉంది. వారిద్దరూ ఓపెనింగ్ జోడీగా చక్కగా పరుగులు రాబట్టాలని నేను కోరుకుంటున్నాను. వారిద్దరిలో వేర్వేరు బలాలున్నాయి. ఒకరు భారీ షాట్లు ఆడితే, మరొకరు బంతిని సున్నితంగా బాదుతారు. వారిద్దరూ మంచి ఓపెనర్లు' అని అశ్విన్ అన్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్‌కింగ్స్ తన మొదటి మ్యాచ్‌ను గువాహటి వేదికగా మార్చి 30న రాజస్థాన్ రాయల్స్‌తో ఆడనుంది. మార్చి 28న చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌తో ఐపీఎల్ నూతన సీజన్ ప్రారంభం కానుంది.







Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com